
నాగాయలంక మండలం తలగడదీవిలో కొబ్బరి చెట్టుపై పడిన పిడుగు

ఈదురుగాలులు, పిడుగులతో కూడిన అకాల వర్షం ఆదివారం జిల్లావాసులను వణికించింది. ఉదయం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై బలంగా గాలులు వీస్తూ, ఉరుములు, మెరుపులతో బీభత్సం సృష్టించింది. కడవకొల్లులో పశువులపాక కూలిపోయి పశువులు గాయపడ్డాయి. జిల్లా వ్యాప్తంగా మామిడి, అరటి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. ఆరబెట్టిన పసుపు, మొక్కజొన్న, ధాన్యం రాశులు తడిచిపోయాయి. అకాల వర్షం రైతన్నకు అపార నష్టం తెచ్చిపెట్టింది. మొవ్వ మండలం కోసూరు గ్రామానికి చెందిన మాతంగి సుప్రదీప్(23) శ్రీకాకుళం-గాజుల్లంక రహదారి వెంబడి కృష్ణానదిలో నుంచి ద్విచక్ర వాహనంపై తెనాలి వెళ్తుండగా మార్గం మధ్యలో పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కోడూరు మండలం పిట్టల్లంకలో పిడుగుపడి పది ఎకరాల గడ్డివామి దగ్ధమైంది.

ముంచెత్తిన వాన

జిల్లాలో భారీ వర్షంతో నేలకూలిన అరటి, మొక్కజొన్న పంటలు


తోట్లవల్లూరు మండలం వల్లూరుపాలెంలో తడిచిన మొక్కజొన్న

- అవనిగడ్డ, మోపిదేవి మండలాల్లో నేలరాలిన మామిడి
- మోపిదేవిలో పసుపు పంట వర్షార్పణం
- తోట్లవల్లూరు, కంకిపాడు, గన్నవరంలో తడిసిన మొక్కజొన్న, ధాన్యం రాశులు
- ఈదురుగాలులకు రోడ్లపై అడ్డంగా పడిపోయిన చెట్లు
- పలు చోట్ల విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం
- అకాల వర్షంతో తీవ్రంగా నష్టపోయిన రైతన్నలు
- పిడుగుపాటుకు గురై కోసూరు యువకుడు మృతి
- పిట్టల్లంకలో 10 ఎకరాల వరి గడ్డివామి దగ్ధం


అవనిగడ్డలో జలమయంగా మారిన ప్రధాన రహదారి

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జిల్లాలో కురిసిన అకాల వర్షం వల్ల రైతులకు అపార నష్టం వాటిల్లింది. అవనిగడ్డ మండలం ఎడ్లంక, పాతఎడ్లంక, పులిగడ్డ, మోపిదేవి మండలం మోపిదేవి వార్పు తదితర ప్రాంతాల్లో వీచిన ఈదురు గాలులకు కోతకు సిద్ధంగా ఉన్న మామిడి కాయలు నేల రాలిపోయాయి. మోపిదేవి మండలం బొబ్బర్లంక, ఘంటసాల మండలంలోని పలు గ్రామాల్లో అరటి తోటలు నేలవాలాయి. మోపిదేవిలో ఆరబెట్టిన పసుపు పంట తడిచిపోయింది. మొవ్వ మండలంలో ఒక మోస్తరు వర్షం కురిసింది. చల్లపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. కోడూరు మండలంలోని అన్ని గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. పిట్టల్లంకలో పిడుగుపడి 10 ఎకరాల వరి గడ్డి వామి దగ్ధమైంది. మచిలీపట్నంలో మంగినపూడి బీచ్ తదితర ప్రాంతాల్లో ఒకమోస్తరు వర్షం కురిసింది. బలమైన గాలులు వీచాయి.

- మొవ్వ మండలం కోసూరు గ్రామానికి చెందిన మాతంగి సుప్రదీప్(23) శ్రీకాకుళం-గాజుల్లంక రహదారి వెంబడి కృష్ణానదిలో నుంచి మిగతా 6లో..

నేడు కోస్తాతీరం వెంబడి ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం!


కడవకొల్లులో గాలివానకు గేదెలపై కూలిన చావిడి తొలగిస్తున్న స్థానికులు

దాళ్వా రైతులకు ఇబ్బందులు

కంకిపాడు, గన్నవరం తదితర ప్రాంతాల్లో రైతులు రబీ సీజన్‌లో బోరు నీటిని ఆధారంగా చేసుకుని వరిసాగు చేశారు. ఈ ఏడాది ఎకరానికి 50 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. రైతులు యంత్రాల ద్వారా వరి కోతలు పూర్తిచేశారు. ధాన్యంలో తేమశాతం, నూకశాతం అధికంగా ఉందనే కారణంతో స్థానిక వ్యాపారులు, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో పనిచేసే సిబ్బంది కూడబలుక్కుని బస్తా ధాన్యం మద్దతు ధర రూ.1,725 ఉంటే రూ.1500లకు కొనుగోలు చేశారు. దీంతో రెండు, మూడు రోజులపాటు ధాన్యం ఆరబెడితే తేమశాతం తగ్గుతుందనే కారణంతో రైతులు పొలంలోనే ధాన్యం రాశులుగా ఉంచారు. వ్యాపారులు, ఆర్‌ఎస్‌కేలలో పనిచేసే సిబ్బంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి బస్తాకు రూ.1500 ధర ఇచ్చి, ప్రభుత్వ లెక్కల్లో మాత్రం పూర్తిస్థాయి మద్దతు ధర ఇచ్చినట్లుగా తప్పుడు లెక్కలు నమోదు చేశారని రైతులు వాపోతున్నారు. ఊహించని విధంగా ఆదివారం వర్షం కురిసి, పొలంలో నీరు నిలబడటంతో ధాన్యం కొంతమేర తడిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షం దెబ్బకు ధాన్యంలో మరింతగా తేమశాతం పెరుగుతుందని, దీంతో మరింతగా ధర తగ్గిస్తారనే భయం రైతులను వెంటాడుతోంది.


మోపిదేవిలో తడిచిన పసుపు పంట

మహోన్నత శక్తి యోగా

- ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్
- ప్రపంచ రికార్డులో భాగస్వాములకు సర్టిఫికెట్ల ప్రదానం

6లో


6లో

ప్రశాంతంగా నీట్

- నగరంలోని సిద్ధార్థ కళాశాల వద్ద పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

సరసాల సార్ సస్పెన్షన్

ఏపీటీడీసీ డివిజనల్ ఆఫీస్ అకౌంటెంట్ గంగి వెంకటేశ్వర్లుపై వేటు!

భవానీపురం ప్రాంత మహిళతో రాసలీలలు!

- హరిత బెర్మ్ పార్క్, ఏపీటీడీసీ ప్రధాన కార్యాలయంలో కామకలాపాలు
- వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'.. ఒక్క రోజులో విచారణ పూర్తి
- వెంకటేశ్వర్లును సస్పెండ్ చేసిన ఏపీటీడీసీ డివిజనల్ అధికారులు!

నేడు సస్పెన్షన్ ఆర్డర్ అందజేత

హరిత బెర్మ్ పార్క్, ఏపీటీడీసీ ప్రధాన కార్యాలయంలో కామకలాపాలు సాగిస్తున్న సరసాల సార్ సస్పెండ్ అయ్యారు. పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) విజయవాడ డివిజనల్ కార్యాలయంలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న గంగి వెంకటేశ్వర్లు ఓ మహిళతో రాసలీలలకు పాల్పడుతున్నట్టు గుర్తించిన ఏపీటీడీసీ ఉన్నతాధికారులు అతనిపై శాఖాపరంగా తక్షణ చర్యలు చేపట్టారు. సోమవారం అధికారికంగా సస్పెన్షన్ లేటర్ ఇవ్వనున్నారు. వ్యక్తిగతంగా వాట్సాప్ ద్వారా కూడా సస్పెన్షన్ ఆర్డర్‌ను అతనికి పంపనున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఏపీటీడీసీ డివిజనల్ కార్యాలయంలోని కీలక విభాగంలో బాధ్యతలు నిర్వహిస్తున్న ఉద్యోగి ఒకరు రోజూ రాత్రిపూట తన ద్విచక్రవాహనంపై ఓ మహిళను వెంటబెట్టుకుని కార్యాలయానికి వచ్చి కామకలాపాలు సాగిస్తున్నారు. దీనిపై 'సరసాల సార్!' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' ఆదివారం ప్రత్యేక కథనం ప్రచురించింది. దీనిపై ఏపీటీడీసీ ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. కార్యాలయంలో రాసలీలలు సాగిస్తున్నది పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) విజయవాడ డివిజనల్ కార్యాలయంలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న గంగి వెంకటేశ్వర్లుగా గుర్తించారు. విచారణను త్వరగా పూర్తి చేయాల్సిందిగా ఆదేశించారు. విజయవాడ డివిజన్ అధికారులు శరవేగంగా విచారణను పూర్తి చేసి ఆదివారం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) పద్మావతికి నివేదికను అందించారు. ఏపీటీడీసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈడీ పద్మావతి కూడా ఆగమేఘాల మీద సస్పెండ్ చేయాల్సిందిగా విజయవాడ డివిజన్ అధికారులకు నిర్దేశించారు. విజయవాడ డివిజన్ అధికారులు సస్పెన్షన్ ఆర్డర్‌ను సిద్ధం చేశారు. ఈ ఆర్డర్‌ను సోమవారం అకౌంటెంట్ వెంకటేశ్వర్లుకు అందించనున్నారు. అతని వాట్సాప్‌కు కూడా సస్పెన్షన్ ఆర్డర్‌ను పంపించనున్నారు. ప్రభుత్వ రంగ సంస్థ ఆస్తిని ప్రైవేటు అవసరాల కోసం దుర్వినియోగం చేయటంపై క్రమశిక్షణా చర్యల్లో భాగంగా సస్పెండ్ చేస్తున్నట్టు ఆర్డర్‌లో పేర్కొన్నట్టు సమాచారం. విజయవాడ హెడ్ క్వార్టర్ పరిధి దాటి ఎక్కడికీ వెళ్లకూడదని కూడా వెంకటేశ్వర్లును ఏపీటీడీసీ ఉన్నతాధికారులు ఆదేశించారు.

అకౌంటెంట్ వెంకటేశ్వర్లు చాలా కాలంగా ఒక మహిళతో ఏపీటీడీసీ ఆఫీసుల్లో రాసలీలలు సాగిస్తున్నాడని విచారణలో అధికారులు గుర్తించారు. గతంలో హరిత బెర్మ్‌పార్క్‌లోని స్టాఫ్ రూమ్‌లో సాగించిన రాసలీలలు, విజయవాడ డివిజన్ ప్రధాన కార్యాలయంలో సాగించిన రాసలీలల్లో వెంకటేశ్వర్లు ప్రత్యక్షంగా పాల్గొన్నారని సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా నిర్ధారించారు. హరిత బెర్మ్‌పార్క్‌లోని స్టాఫ్ రూమ్‌లో అత్యంత జుగుప్సాకరంగా ఉన్న దృశ్యాలు బయటపడినట్టు సమాచారం. హరిత బెర్మ్‌పార్క్‌లో సాగించిన రాసలీలల వీడియోలు దారుణంగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. డివిజనల్ ఆఫీసుకు కూడా తరచూ బైక్‌పై మహిళను ఎక్కించుకుని వస్తుండటం, కార్యాలయంలోకి ఆ మహిళను తీసుకు వెళ్లి తలుపులు వేసుకోవటం, అర్ధగంట తర్వాత ఇద్దరూ కలిసి బయటకు వచ్చి వాహనం మీద తిరిగి వెళ్లిపోతున్న దృశ్యాల్లోనూ వెంకటేశ్వర్లు ఉన్నట్టుగా గుర్తించారు. వెంకటేశ్వర్లుతో ఉన్న మహిళ ఎవరు అన్న దానిపై కూడా ఏపీటీడీసీ అధికారులు విచారణ జరిపారు. నగరానికి చెందిన మహిళగా గుర్తించారు. తరచూ వాకింగ్ చేయటానికి మిగతా 6లో..

నాడు వీడియోలు తీసి బయటపెట్టినా మారని తీరు!

రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి

కొండాయపాలెం వద్ద బైక్‌ను ఢీకొన్న కారు


హాన్విక(ఫైల్)

పామర్రు, మే4 (ఆంధ్రజ్యోతి): పామర్రు-దిగమర్రు జాతీయ రహదారిపై అడ్డాడ సమీపంలోని కొండాయపాలెం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడాదిన్నర చిన్నారి మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. గుడ్లవల్లేరు మండలం డోకిపర్రుకు చెందిన ఉప్పలపాటి దుర్గారావు, హారిక దంపతులు ఏడాదిన్నర హాన్వికతో కలిసి బైక్‌పై పామర్రు వైపు నుంచి అడ్డాడలోని హారిక అమ్మమ్మ ఇంటికి వెళ్తున్నారు. కొండాయపాలెం వద్ద వీరిని వెనుక నుంచి గుడివాడ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. వీరిని 108లో బందరు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో హాన్విక మృతి చెందింది. చిన్నారి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఎస్సై రాజేంద్రప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు ఆపలేదని ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి!

- సర్ది చెప్పబోయిన మహిళా కండక్టర్‌పైనా..
- పోలీసుల రంగప్రవేశం.. ముగ్గురి అరెస్టు

6లో

ఆయకట్టు పొలాలకు నీరందించడంతో పాటు భూగర్భ జలాలను పెంపొందించడమే లక్ష్యంగా శతాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన చెరువులు, ఏరులు ఆక్రమణలతో నానాటికీ విస్తీర్ణం తగ్గిపోతున్నాయి. అక్రమార్కుల కబ్జాలతో అస్తిత్వాన్ని కోల్పోతూ మెట్ట ప్రాంత రైతులకు మళ్లీ డ్రాట్ ఏరియా(నీటి కరువు) మూలంగా బోర్లు వేసుకునేందుకు కూడా నిషేధం విధించే పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా గత ప్రభుత్వ హయాంలో పూడ్చి వేసిన చెరువులు, ఏరులు(రామిలేరు, బుడమేరు)ల్లో దర్జాగా ఉద్యాన పంటలు(ఆయిల్‌పామ్, చెరకు) సాగు చేస్తున్నారు. దీనిపై సర్వత్రా రైతుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


రామిలేరులో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోట


ఆక్రమణలో గౌరమ్మ కుంట చెరువు

'ఆక్రమణ చెర!

దర్జాగా చెరువులు, ఏరులు కబ్జా!

వాటిలో ఉద్యాన పంటల సాగు • నీటి నిల్వలు లేక పడిపోతున్న భూగర్భ జలాలు

- మళ్లీ బోర్లపై రానున్న నిషేధం!
- పట్టించుకోని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

(ఆంధ్రజ్యోతి, హనుమాన్ జంక్షన్ రూరల్): బాపులపాడు మండలంలో కొత్తపల్లి, బిళ్లనపల్లి, మడిచర్ల, తదితర మెట్ట ప్రాంతాల్లోని చెరువులతో పాటు అధిక వర్షం పడితే పొలాలు ముంపునకు గురవకుండా వరదనీటిని తరలించే రామిలేరు ఆక్రమణకు గురైంది.

- కొత్తపల్లిలో 14 ఎకరాల చెరువులో సుమారు నాలుగు ఎకరాలు కొందరు ఆక్రమించి ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. చెరువును ఆనుకుని ఉన్న స్వంత భూమి పట్టాదారు పాసుపుస్తకాల సహాయంతో ఈ భూమిని కూడా కలుపుకున్నారు. దీనిపై తహసీల్దార్ మురళీకృష్ణ పంచాయితీ అధికారులకు నోటీసులు జారీ చేసినా ఫలితం శూన్యం.
- బిళ్లనపల్లి గ్రామంలో సుమారు ఐదు ఎకరాల విస్తీర్ణంలోని గద్దె గౌరమ్మ కుంట చెరువు, 12.21 ఎకరాల్లోని జగన్‌మోహిని చెరువు, 12.51 ఎకరాల్లోని వినాయక చెరువు ఆక్రమించి గత ప్రభుత్వ హయాంలో మట్టితోలి చెరుకు లాంటి ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. మూడు చెరువుల్లో సుమారు 12 ఎకరాలకుపైగా జరిగిన ఆక్రమణలపై స్థానికులు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే మిగతా 6లో..

తూతూమంత్రంగా చర్యలు

చెరువులు, ఏరులు భారీగా ఆక్రమణలకు గురైనా అధికారులు మాత్రం కన్నెత్తి చూడకపోవటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చెరువులు ఆక్రమణలకు గురైనట్లు ఆధారాలతో సహా ఫిర్యాదులు చేసినా ఆక్రమణదారులకు, పంచాయతీ వారికి నోటీసులిచ్చి చేతులు దులుపుకుంటున్నారంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అరకొర పూడిత తీతతో సమస్య మళ్లీ మొదలు..

ఆక్రమణలకు గురైన చెరువుల చెర విడిపించేందుకు ఒక శాఖపై, మరొక శాఖ అధికారులు వంతులు వేసుకుని నిర్లక్ష్యం చేయడం వల్ల అక్రమార్కులకు మరింత ఊతమిస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా అరకొర పనులతో చెరువులకు మేలు జరగడంలేదని, కనీసం ఒక అడుగు మేర కూడా పూడిక తీయట్లేదని కానుమోలు గ్రామానికి చెందిన రైతులు తెలిపారు. పూడికతీసిన మట్టిని చెరువు కట్టపై పోసి వదిలివేయడంతో వర్షాకాలంలో మట్టి కరిగి చెరువులోకి కారిపోయి ఎప్పటిలా మెరక తేలిపోతుందంటున్నారు.



పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ లక్ష్మీశ

ప్రశాంతంగా నీట్

» ఎన్టీఆర్ జిల్లాలో 13,455 మంది హాజరు

విజయవాడ, మే 4 (ఆంధ్రజ్యోతి) : నీట్-2025 యూజీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం జరిగిన పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 28 కేంద్రాల్లో 13,625 మంది అభ్యర్థులకు 13,455 (98.75 శాతం) మంది హాజరయ్యారు. నగరంలో ఉదయం వరుణుడు ఆందోళన కలిగించినా కొంతసేపటికి వర్షం ఆగిపోవడంతో అభ్యర్థులు ఊపిరిపీల్చుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా నీట్ పరీక్ష సజావుగా ముగిసింది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎక్కడా ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా సిబ్బంది జాగ్రత్త పడ్డారు. పీజీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా కలెక్టర్ తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, బయోమెట్రిక్, కంట్రోల్ రూమ్ విధులు, వీడియోగ్రఫీ, సీల్డ్ కవర్, నివేదికలు తదితర అంశాలపై నిర్వహణ అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు.



ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ గంగాధరరావు

కృష్ణాజిల్లాలో 97.90 శాతం హాజరు

మచిలీపట్నం : కృష్ణాజిల్లాలో ఆదివారం నీట్ యూజీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 97.90శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. కేంద్రీయ విద్యాలయంలో జరిగిన పరీక్షలో 240మందికిగాను 234మంది హాజరయ్యారు. కృష్ణాయూనివర్సిటీలో 376మందికి 361మంది హాజరయ్యారు. గన్నవరం వీఎస్ఎస్‌టీ జాన్స్‌స్కూల్‌లో 480మందికి 478మంది హాజరయ్యారు. జిల్లాలోని మూడు పరీక్షాకేంద్రాల్లో 1,096మందికి 1,073మంది హాజరుకాగా 97-90శాతం నమోదైంది. పరీక్షా కేంద్రాలను ఎస్పీ ఆర్.గంగాధరరావు, రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

గ్రూప్-1 మెయిన్స్‌కు 1,153 మంది హాజరు

విజయవాడ, మే 4 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్-1 పరీక్ష రెండోరోజు ప్రశాంతంగా ముగిసింది. ఎన్టీఆర్ జిల్లాలో 1,801 మందికిగాను 1,153 (64.02 శాతం) హాజరయ్యారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆదివారం పరీక్షను అధికారులు నిర్వహించారు. ఉదయం వరుణుడు ఇబ్బంది పెట్టినా అధికారుల చొరవతో రోడ్లపై నీటిని యుద్ధ ప్రాతిపదికన తొలగించి, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేయడంతో అభ్యర్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోగలిగారు.

కానూరులో కళాశాల విద్యార్థుల మధ్య ఘర్షణ

» ఫర్నీచర్ ధ్వంసం.. రంగంలోకి పోలీసులు

పెనమలూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): కానూరులోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో శనివారం సాయంత్రం విద్యార్థుల మధ్య చెలరేగింది. ఘర్షణలో కళాశాలకు చెందిన ఫర్నీచర్ ధ్వంసమైంది. దీంతో ఆదివారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కళాశాల యాజమాన్యం, పెనమలూరు పోలీసులు పిలిపించి విచారణ చేశారు. మురళీనగర్‌లోని ఓ ప్రయివేటు కళాశాలలో నీట్ లాంగ్‌టర్మ్‌కు శిక్షణ పొందుతున్న విద్యార్థుల మధ్య ఎప్పటి నుంచో చిన్నచిన్న గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం రాత్రి విద్యార్థులు రెండు గ్రూపులుగా విడిపోయి పరస్పరం దాడులు చేసుకున్నారు. ఘర్షణలో కళాశాలకు సంబంధించిన ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న పెనమలూరు పోలీసులు కళాశాల యాజమాన్యంతో చర్చించి గొడవకు కారణాలను తెలుసుకొని విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. తల్లిదండ్రులను పిలిపించి విద్యార్థులను వారికి అప్పగించారు.

ముంచెత్తిన వాన..

(5వ పేజీ తరువాయి)

ద్విచక్ర వాహనంపై తెనాలి వెళ్తుండగా మార్గం మధ్యలో పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అతనితో పాటు ఉన్న మరో యువకుడు కొద్దిపాటి గాయాలతో బయటపడ్డాడు.

- పెనమలూరు నియోజకవర్గం ఉయ్యూరు మండలం పెదఓగిరాల, చినఓగిరాల గ్రామాల్లో బలంగా గాలులు వీయడంతో కోతకు సిద్ధంగా ఉన్న మొక్కజొన్న, అరటి తోటలు నేల వాలాయి. ఉయ్యూరు-కాటూరు రహదారి వెంబడి చెట్లు కూలిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షం కారణంగా రోడ్లపై వర్షం నీరు నిలిచిపోయింది. కడవకొల్లులో పశువులపాక కూలిపోయింది. ఆరేడు పశువులు గాయాలపాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి కూలిన పాకను తొలగించి, పశువులను బయటకు తీసుకువచ్చారు. కంకిపాడు, మద్దూరు, పునాదిపాడు, ఉప్పులూరు, కోలవెన్ను గ్రామాల్లో పొలాల్లో రాశులపై ఉన్న ధాన్యం తడిచింది. కంకిపాడులో చెట్లు కూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.
- పామర్రు నియోజకవర్గం తోట్లవల్లూరు మండలంలోని లంక భూముల్లో, వల్లూరుపాలెంలో కల్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్న తడిచిపోయింది. పెడన నియోజకవర్గంలోని పెడన, కృత్తివెన్ను, బంటుమిల్లి, గూడూరు మండలాల్లోనూ భారీవర్షం కురిసింది. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రొయ్యల చెరువుల్లో ఫ్యాన్లు తిరగక ఆక్సిజన్ కొరత ఏర్పడటంతో ఆక్వా రైతులు జనరేటర్ల ద్వారా ఫ్యాన్లు తిప్పేందుకు పరుగులు పెట్టారు.
- గుడివాడలోని పలు ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి 10.15 గంటల వరకు భారీ వర్షం కురిసింది. పట్టణంలోని రహదారుల వెంబడి, బస్టాండ్‌లో వర్షపు నీరు నిలిచింది. మట్టి తోలకాలతో రోడ్లు బురదమయమై ప్రయాణికులు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు.
- గన్నవరంలో భారీ వర్షం కురిసింది. గన్నవరం మండలంలోని మాదలవారిగూడెంలో పందిళ్లపై ఉన్న పొగాకు తడిచిముద్దయింది. ముస్తాబాద, సూరంపల్లిలో కల్లాల్లో ఉన్న ధాన్యం తడిచిపోయింది. భారీ వర్షం కారణంగా పొలాల్లో నీరు నిలబడింది. ధాన్యం బయటకు ఎలా తెచ్చుకోవాలనే అంశంపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

సరసాల సార్ సస్పెన్షన్

(5వ పేజీ తరువాయి)

హరిత బెర్మ్ పార్క్‌కు వస్తుందని, ఆ సమయంలోనే వెంకటేశ్వర్లు ఆమెను ట్రాప్ చేసి లోబరుచుకున్నట్టు తెలిసింది. అప్పటి నుంచి తరచూ హరిత బెర్మ్‌పార్క్ స్టాఫ్ రూమ్‌లోనే వీరిద్దరూ తరచూ ఏకాంతంగా ఉండేవారని సమాచారం. స్టాఫ్ రూమ్‌లో కామక్రీడల వ్యవహారాన్ని అక్కడి సిబ్బంది వీడియోలు తీసి బయట పెట్టడంతో ఏకంగా విజయవాడ డివిజనల్ కార్యాలయాన్నే ఇందుకోసం ఎంపిక చేసుకుని కామకలాపాలు సాగించటం ప్రారంభించారు. కొద్ది నెలలుగా తరచూ మహిళతో వస్తున్న అకౌంటెంట్ వ్యవహార శైలిపై అనుమానం వచ్చిన సెక్యూరిటీ సిబ్బంది ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లటంతో ఈ వ్యవహారం వెలుగు చూసింది.



జలమయమైన ఎన్టీఆర్ స్టేడియం





ఆదివారం ఉదయం 8 గంటల ప్రాంతంలో కానూరు వద్ద కమ్మేసిన కారుమబ్బులు

గాలి దుమారం

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి చేసిన వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఆదివారం ఉదయం జిల్లా కరి మబ్బులతో భీతిగొల్పింది. ఈదురు గాలులతో గంటపాటు భారీ వర్షం కురిసింది. పెనుగాలులకు పలుచోట్ల భారీ చెట్లు నేలకూలాయి. విస్సన్నపేటలో వర్షం భారీగా కురిసింది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో సరఫరా నిలిపివేశారు. రోడ్లు జలమయం కావడంతో నీరు నిలిచిపోయి వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడ్డారు. - (ఆంధ్రజ్యోతి-విజయవాడ)





పెనుగాలికి రోడ్డుపై చెల్లా చెదురుగా పడిపోయిన ఇనుప బారికేడ్లు







కృష్ణా జిల్లా లక్ష్మీనరసింహపురం వెళ్లే దారిలో గాలివానకు పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్, నాగాయలంక బోసుబొమ్మ సెంటర్‌లో వర్షపు నీరు

మహోన్నత శక్తి యోగా

» ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్

» ప్రపంచ రికార్డులో భాగస్వాములకు సర్టిఫికెట్ల ప్రదానం

చల్లపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి) : సనాతన ధర్మం అందించిన మహోన్నత శక్తి యోగా అని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్ అన్నారు. మహాసూర్యవందనం - 2025, ఉభయ తెలుగు రాష్ట్రాల యోగా చైతన్య యాత్ర పేరుతో అరకులో గత నెలలో 21850 మందితో 108 నిముషాల్లో 108 సార్లు సూర్యనమస్కారాలతో ప్రపంచ రికార్డు నెలకొల్పిన వారికి సర్టిఫికెట్ల ప్రదానోత్సవం ఆదివారం రాత్రి పురిటిగడ్డ శ్రీకృష్ణసాయి ధాన్య మందిర కళ్యాణమండపంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ, యోగాతో ఆరోగ్యంగా ఉండగలమన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతర యోగాసాధన ద్వారానే శక్తిని పొందగల్గుతున్నారని తెలిపారు. ప్రపంచ రికార్డులో యార్లగడ్డ ఆయుష్ ఆరోగ్య యోగా మందిర్ విద్యార్థులకు భాగస్వామ్యం లభించటం గర్వకారణమన్నారు. అరకులో వేలాదిమంది గిరిజనులతో ప్రపంచ రికార్డుస్థాయిలో యోగ నిర్వహించిన పతంజలి శ్రీనివాసును అభినందించారు. విశ్రాంత ఆర్డీవో నాదెళ్ల శివరామకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో యోగా గురువు పతంజలి శ్రీనివాసు, ఆయుష్ హాస్పటల్ ఎండీ డాక్టర్ యార్లగడ్డ రమేష్, సర్పంచ్ యార్లగడ్డ హేమాంజనేయ ప్రసాద్, యోగా శిక్షకులు తదితరులు పాల్గొన్నారు. ప్రపంచ రికార్డులో భాగస్వాములైన కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన 24 మందికి వరల్డ్ రికార్డ్స్ యూనియన్ వారి సర్టిఫికెట్లను ఎమ్మెల్యే అందజేశారు. పతంజలి శ్రీనివాసును సన్మానించారు. తొలుత విద్యార్థులతో కలిసి గురువు పతంజలి శ్రీనివాస్ తదితరులు యోగాసనాలు వేశారు. పలువురు చిన్నారులు వేసిన ఆసనాలు ఆకట్టుకున్నాయి.



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



రికార్డు సాధించిన విద్యార్థులతో ఎమ్మెల్యే బుద్దప్రసాద్ తదితరులు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎల్‌వి గ్రూప్ చైర్మన్ పెన్మత్స శ్రీనివాసరాజు, పలువురు ప్రముఖులు

ఎస్ఎల్‌వి ఇన్‌ఫ్రా నూతన ప్రాజెక్టు ప్రారంభం

వన్‌టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : రామవరప్పాడులో ఎస్ఎల్‌వి అమరావతి గ్రాండ్ త్రీలో ఆదివారం ఎస్ఎల్‌వి ఇన్‌ఫ్రా నూతన లేఅవుట్ ప్రాజెక్టు ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా గ్రూప్ చైర్మన్ పెన్మత్స శ్రీనివాసరాజు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కన్‌స్ట్రక్షన్ రంగంలో కస్టమర్లకు నాణ్యత అందించటంలో రాజీ పడని వ్యక్తి అని పెన్మత్స శ్రీనివాసరాజును కొనియాడారు. రామవరప్పాడులో ఎస్ఎల్‌వి గ్రూప్ అమరావతి గ్రాండ్ వన్, టూ, త్రీ అపార్టుమెంట్లు, గ్రీన్ మెడోస్ విల్లాలు నిర్మించారని తెలిపారు. చైర్మన్ పెన్మత్స శ్రీనివాసరాజు మాట్లాడుతూ 20 ఏళ్లుగా కన్‌స్ట్రక్షన్ రంగంలో గేటెడ్ కమ్యూనిటీ అపార్టుమెంట్‌లు, విల్లాలు, సిటీ కమర్షియల్ స్పేస్, లేఅవుట్లు మొత్తం 40 ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. రామవరప్పాడు, గుణదల, మంగళగిరిలో అపార్టుమెంట్‌లు, విల్లాలు నిర్మించినట్టు తెలిపారు. కస్టమర్ల నమ్మకమే తమ సంస్థకు పునాది అని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి రావటంతో స్థిరాస్థి రంగం బలపడిందని, ఇతర రాష్ట్రాల నుంచి కూడా అపార్టుమెంట్‌లు, ఇళ్ల స్థలాలు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎల్‌వీ సీఈవో, డైరెక్టర్ విఘ్నేష్ అప్పలరాజు (నాని), విశ్వహిందూ పరిషత్ జాతీయ ట్రస్టీ పుట్టగుంట సతీష్ కుమార్, డైరెక్టర్ ఉప్పలపాటి చైతన్య వర్మ, గ్రూప్ చైర్మన్ వెంకటరత్నం, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కోశాధికారి దుర్గాప్రసాద్ రాజు, ప్రముఖులు, వ్యాపార వేత్తలు, రైతులు పాల్గొన్నారు.

మహిళా సెక్యూరిటీ గార్డును దూషించి, కొట్టిన వ్యక్తి అరెస్టు

ఇంద్రకీలాద్రి, మే 4 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో విధుల్లో ఉన్న ప్రైవేటు మహిళా సెక్యూరిటీ గార్డును అసభ్యకరంగా దూషించి కొట్టిన ఓ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధిని ఆదివారం వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. బాధితురాలు పోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట మహంతిపురం అప్పలస్వామివీధిలో యాండ్రపు వెంకట లావణ్య కుటుంబసభ్యులతో ఉంటోంది. సుమారు ఎనిమిదేళ్ల నుంచి ప్రైవేటు సెక్యూరిటీ గార్డుగా దుర్గగుడి దేవస్థానంలో పనిచేస్తున్నది. ఆదివారం ఉదయం 5 గంటలకు ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు వద్ద విధుల్లో ఉండగా అక్కడకు వచ్చిన ఓ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధి మోహన్‌ను ఆమె తన గురించి దేవస్థానంలో పలువురికి అసభ్యకరంగా ఎందుకు చెబుతున్నావని ప్రశ్నించింది. సహోద్యోగితో అక్రమ సంబంధం అంటగట్టటం ఎంతవరకు న్యాయం అని మోహన్‌ను నిలదీసింది. దీంతో మోహన్ ఆమెను అసభ్యకరంగా దూషిస్తూ ముఖంపై పిడిగుద్దులు గుద్దడంతో ఆమె ముఖంపై గాయాలయ్యాయి. దీంతో బాధితురాలు దేవస్థాన అధికారులు, సెక్యూరిటీ సంస్థ ప్రతినిధులకు విషయం తెలిపి వారి సూచనల మేరకు వన్‌టౌన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు మోహన్‌పై బీఎన్ఎస్ ప్రకారం 74, 79, 351(3), 115(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

ఆక్రమణ చెర!

(5వ పేజీ తరువాయి)

అధికారులు కరువయ్యారు.

- రామిలేరులో పల్లెర్లమూడి- శోభనాపురం మధ్యలో సుమారు ఎకరం పైగా ఆక్రమించి ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. గతేడాది ఇదే రామిలేరు వరద ఉధృతికి వేలాది ఎకరాలు నీట మునగడంతో పాటు జాతీయ రహదారిపై బొమ్ములూరు వద్ద మూడు అడుగుల మేర నీరు నిలిచి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.
- బుడమేరు ఆక్రమణల వల్ల రంగయ్యప్పారావుపేట, ఓగిరాల గ్రామాలు రోజులు పాటు నీటమునిగి ప్రజలు ఇళ్లు ఖాళీ చేశారు. ఆరుగొలను, తిప్పనగుంట, కానుమోలు తదితర గ్రామాల్లో వేలాది ఎకరాల వరి పంట నీటమునిగిపోయింది.

డ్రాట్ ఏరియా నుంచి మళ్లీ నిషేధం దిశగా..

కొత్తపల్లి, బిళ్లనపల్లి, మడిచర్ల, శోభనాపురం, తదితర మెట్ట ప్రాంత గ్రామాల్లో గతంలో భూగర్భజలాలు అందుబాటులో లేని కారణంగా డ్రాట్ ఏరియా(బోర్లు వేయడంపై నిషేధం)గా పరిగణించారు. గత టీడీపీ ప్రభుత్వ హయంలో నిర్మించిన చెక్‌డ్యాంలు, పంట కుంటలు వల్ల భారీ వర్షాలకు నీటితో నిండి భూగర్భ జలాలు అందుబాటులోకి వచ్చాయి. దీనితో రెండు సంవత్సరాల క్రితం నిషేధం ఎత్తివేశారు. ప్రస్తుతం జరుగుతున్న ఆక్రమణలను అడ్డుకుని, చెరువులు, ఏరుల్లోని ఆక్రమణలు తొలగించకపోతే నీటి నిలువ సామర్థ్యం తగ్గి భూగర్భ జలాలు మళ్లీ అడుగంటే ప్రమాదం పొంచి ఉంది. ఇదే జరిగితే మళ్లీ బోర్లపై నిషేధం విధిస్తూ డ్రాట్ ఏరియాలోకి వెళ్లే ప్రమాదముంది.

ఆక్రమణలను కట్టడి చేయాలి

రెవెన్యూ, జలవనరులశాఖలతో పాటు పంచాయతీ విభాగం కూడా సమన్వయం చేసుకుంటూ ఆక్రమణలు తొలగించడంతో పాటు పూడికతీత పనులను మూడు అడుగుల మేర తీయాలని రైతులు కోరుతున్నారు. దీని వల్ల భూగర్భజలాలు అందుబాటులోకి రావడంతో పాటు కాలువ కింద ప్రాంతాల్లో ముంపు ప్రమాదం నుంచి వేలాది ఎకరాలను రక్షించవచ్చు.

సరిహద్దులు ఏర్పాటు చేస్తే మేలు

శాఖల సమన్వయంతో ఆక్రమణలకు గురైన చెరువులను గుర్తించి పూడికతీసి మట్టిని తరలించడంతో పాటు సరిహద్దులను ఏర్పాటు చేస్తే పూర్తి నిల్వ సామర్థ్యం పెరిగి రైతులకు ఉపకరిస్తుందని బిళ్లనపల్లి రైతులు గోపి, వెంకటేశ్వరరావు, కొత్తపల్లి రైతు షేక్ బాషా చెబుతున్నారు. ప్రతి రెండు లేదా మూడు నెలలకు అధికారులు, చెరువు సంఘాల నాయకులు, ఆయకట్టు రైతులతో సమావేశం ఏర్పాటు చేయడం వల్ల చెరువులు, ఏరుల ఆక్రమణను కట్టడి చేస్తూ రక్షణ చర్యలపై చర్చించవచ్చునని పేర్కొన్నారు.

అమ్మా.. నీవద్దకే వస్తున్నా!

» రోడ్డు ప్రమాదంలో కళ్లెదుటే తల్లి దుర్మరణం

» 21 రోజులు మృత్యువుతో పోరాడి కొడుకు మృతి

» ఈనెల 27న తల్లీకొడుకుల జన్మదినం..

» శోకసంద్రంలో కుటుంబసభ్యులు



తల్లి బోదుల దుర్గా భవానితో సాయి అరవింద్ (ఫైల్)

గుణదల, మే 4 (ఆంధ్రజ్యోతి) : పైల స్నానం చేద్దామని రామవరప్పాడు నుంచి కృష్ణానదికి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన తల్లీకొడుకును రింగ్‌రోడ్డులో లారీ ఢీకొంది. ప్రమాదంలో తల్లి అక్కడికక్కడే మృతిచెందగా.. కుమారుడికి రెండు కాళ్లు ఛిద్రమయ్యాయి. ఈ ఘటన ఏప్రిల్ 14న జరిగింది. కొనూపిరితో చికిత్స పొందుతూ సాయి అరవింద్(23) శనివారం రాత్రి మృతిచెందాడు. ఈ ఘటనతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. వివరాలిలా ఉన్నాయి.. రామవరప్పాడులో నివాసం ఉంటున్న బోదుల దుర్గా భవాని(47), గంగాధరరావులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. గంగాధరరావు పోలవరం ప్రాజెక్టు వద్ద జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కుమార్తె 2016లో తీవ్ర అస్వస్థతకు గురై చనిపోయింది. కుమారుడు సాయి అరవింద్ ప్రభుత్వ డెంటల్ ఆసుపత్రిలో పెస్ట్ కంట్రోల్ విభాగంలో కాంట్రాక్టు బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఇదిలా ఉండగా ఏలూరులో ఉంటున్న సాయి అరవింద్ పెదనాన్న గుండెపోటుతో చనిపోవడంతో దశదిన కార్యక్రమాలకు హాజరై తిరిగి విజయవాడ చేరుకున్నారు. పైలస్నానం చేసి వద్దామని తల్లిని వెంటబెట్టుకుని ఇంటినుంచి బైక్‌పై బయలుదేరిన కొద్దిసేపటికే రామవరప్పాడు రింగ్‌రోడ్డు వద్ద లారీ ఢీకొనడంతో తల్లి దుర్గా భవాని అక్కడికక్కడే మృతిచెందగా.. సాయి అరవింద్ రెండు కాళ్లూ ఛిద్రమయ్యాయి. 21 రోజులుగా ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడి శనివారం రాత్రి మృత్యుఒడికి చేరుకున్నాడు. దీంతో బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. మే 27న తల్లీకొడుకుల పుట్టిన రోజు కావడంతో బంధువులు జీర్ణించుకోలేకపోతున్నారు. కుమార్తెను పోగొట్టుకున్న బాధనుంచి బయటపడిన ఆ తండ్రికి.. భార్య, కుమారుడు కూడా దూరమవడంతో ఆయన్ను ఓదార్చడం ఎవరితరం కావడంలేదు. సాయి అరవింద్ మృతదేహాన్ని ఆదివారం పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియలకు ఏలూరులోని సొంత గ్రామానికి తరలించారు.



బంటుమిల్లిలో ఆర్టీసి డ్రైవర్‌పై దాడి చేస్తున్న నిందితులు

బస్సు ఆపలేదని ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి!

» సర్ది చెప్పబోయిన మహిళా కండక్టర్‌పైనా..

» పోలీసుల రంగ ప్రవేశం.. ముగ్గురి అరెస్టు

బంటుమిల్లి, మే 4(ఆంధ్రజ్యోతి) : ఆపమంటే బస్సు ఆపలేదంటూ కోపంతో డ్రైవర్‌ను కొట్టడమే కాకుండా సర్ది చెప్పబోయిన మహిళా కండక్టర్‌పై దాడి చేసిన ఘటన ఆదివారం సాయంత్రం బంటుమిల్లిలో జరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 15 రోజుల క్రితం పెందుర్రు గ్రామానికి చెందిన సోమిశెట్టి వెంకట నారాయణ కుమార్తెను బస్సు ఎక్కించడానికి ద్విచక్రవాహనంపై బంటుమిల్లి బస్టాండ్‌కు వచ్చారు. ఆదే సమయంలో బస్సు బస్టాండ్ నుంచి బయలు దేరింది. సోమిశెట్టి నారాయణ కుమార్తె పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా.. బస్సును డ్రైవర్ ఆపకుండా లక్ష్మీపురం సెంటర్‌లో ఆపారు. బస్సును ఎందుకు ఆపలేదంటూ డ్రైవర్‌తో వాగ్వివాదానికి దిగడంతో తీవ్ర స్థాయిలో ఘర్షణ జరిగింది. దీనిని మనసులో పెట్టుకున్న సోమిశెట్టి వెంకట నారాయణ, అతడి స్నేహితులైన దాసు శ్రీనివాసరావు, రఘువరపు సతీష్‌లు ఆదివారం సాయంత్రం బంటుమిల్లి నుంచి గుడివాడ వెళుతున్న బస్సును ఆపి అసభ్య పదజాలంతో డ్రైవర్‌ను తిడుతూ దాడి చేశారు. అడ్డు వచ్చిన మహిళా కండక్టర్‌పై అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడిచేశారు. దీంతో భయాందోళనతో ప్రయాణికులు దిగిపోగా.. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. విషయం తెలుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎస్ఐ గణేష్‌కుమార్ నిందితులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ ఎమ్.నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	148, 157, 168
చికెన్ విత్ స్కిన్	286
చికెన్ స్కిన్‌లెస్	296



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 470

పాలడుగుకు మంత్రి పార్థసారథి పరామర్శ

ఉయ్యూరు, మే 4 (ఆంధ్రజ్యోతి) : కేసీపీ షుగర్స్ మాజీ ఏజీఎం పాలడుగు భాస్కరరావును రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదివారం పరామర్శించారు. భాస్కరరావు మాతృమూర్తి ఇటీవల మృతి చెందగా చిన ఓగిరాల నివాసంలో ఆయన కుటుంబ సభ్యులను పార్థసారథి పరామర్శించి సంతాపం తెలియజేశారు. పద్మావతి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ముదునూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాలడుగు సత్యనారాయణ తదితరులు నివాళులర్పించి భాస్కరరావును పరామర్శించి సంతాపం తెలియజేశారు.



చినఓగిరాలలో పద్మావతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పార్థసారథి

గాలివాన బీభత్సం

- దెబ్బతిన్న అరటి, మొక్కజొన్న, వరి
- తడిసిపోయిన పసుపు, పొగాకు
- జలమయమైన రోడ్లు, డ్రెయిన్లు
- విద్యుత్ స్తంభాలపై విరిగిపడిన చెట్లు
- స్తంభించిన విద్యుత్ సరఫరా





మాదలవారిగూడెంలో వర్షానికి తడిసిపోయిన పొగాకు.. మానికొండ పొలాల్లో ఒరిగిన విద్యుత్ స్తంభాలు

పెనమలూరు, మే 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఆదివారం ఉదయం అకస్మాత్తుగా గాలివాన బీభత్సం సృష్టించింది. అరగంటకుపైగా గాలివానతో ప్రజలు భీతిల్లారు. ఆకాశం ఉరుములు మెరుపులతో గర్జించింది. గాలివాన ధాటికి పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా స్తంభించింది. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు ఒరిగాయి. తాడిగడప వందడుగుల రోడ్డులో చెట్లు రోడ్డుకు అడ్డంగా పడిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్థానిక పోలీసులు వెంటనే స్పందించి చెట్లను తొలిగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. పెనమలూరులో విరిగిన చెట్టు ఆటోపై పడడంతో నష్టం వాటిల్లింది. అరటి, మొక్కజొన్న, పసుపు, వరి పంటలు దెబ్బతినడంతో రైతులు నష్టపోయారు. అరటి రైతులు ఎకరానికి షుమారు పాతిక వేలకుపైగా నష్టపోయారని రైతులు తెలిపారు.

కంకిపాడు : మండలంలోని పలు గ్రామాలు ఆదివారం కురిసిన అకాల వర్షానికి అతలాకుతలమయ్యాయి. భారీ వృక్షాలు నేలకొరిగాయి. మండలంలోని ఈడుపుగల్లు ప్రధాన రహదారిపై వెళ్తున్న కారుపై భారీ వృక్షం పడిపోవడంతో భయబ్రాంతులకు గురయ్యారు. అయితే వాహనంలోని ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రతి ఒక్కరూ ఊపిరిపీల్చుకున్నారు. అదే విధంగా బ్యాంక్ కాలనీ వద్ద ఓ భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. పలు భారీ వృక్షాలు విద్యుత్ వైర్లు, స్తంభాలపై పడిపోవడంతో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది కష్టపడాల్సి వచ్చింది.

ఉయ్యూరు : ఉయ్యూరులో ఆదివారం ఉదయం గాలి, వాన బీభత్సం సృష్టించింది. ఆకాశంలో నల్లటి మబ్బులు కమ్మి ఈదురుగాలితో కూడిన భారీ వర్షానికి పలుచోట్ల రోడ్డకడ్డంగా పెద్ద వృక్షాలు నేలకూలగా, మొక్కజొన్న, అరటి పంటలకు నష్టం వాటిల్లింది. దాదాపు గంటన్నరకుపైగా ఎడతెరపిలేకుండా గాలులతో కూడిన వర్షానికి రోడ్లపై మోకాలు లోతున నీరు నిలవగా ప్రజలు ఇబ్బంది పడ్డారు. రోడ్లపై పడిన చెట్లను మండల తహసీల్దార్ సురేశ్‌కుమార్, గండిగుంట కార్యదర్శి కుమార్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖలకు తెలియజేసి జేసీబీతో తొలగింపజేశారు.

కూలిన పశువుల చావిడి

హోరుగాలి, జోరువానకు కడవకొల్లులో పశువుల చావిడి నేలకూలగా గేదెలకు గాయాలయ్యాయి. వీర్ల వెంకటేశ్వరరావు గేదెలు పెంచుతూ పాలవ్యాపారం చేస్తుంటాడు. ఆదివారం ఉదయం పెనుగాలులతో కూడి భారీ వర్షానికి చావిడి కూలి అందులో ఉన్న గేదెలు, దూడలపై పడింది. వర్షం ఆగిన తరువాత స్థానికుల సహాయంతో కూలిన చావిడిని తొలగించగా నాలుగు గేదెలకు గాయాలైనట్టు వెంకటేశ్వరరావు తెలిపారు.

గన్నవరం : మండలంలో ఆదివారం కురిసిన అకాల వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. సుమారు రెండు గంటల పాటు ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తూనే ఉంది. గన్నవరం పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం, బుద్దవరం బస్టాప్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, రాయనగర్, దుర్గాపురం ప్రాంతాల్లోని రహదారులు వర్షపునీటితో నిండిపోయాయి. మాదలవారిగూడెంలో పందిరి మీద ఉన్న పొగాకు వర్షానికి తడిసిపోయింది. అక్కడక్కడ మామిడి కాయలు రాలిపోగా, కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు పట్టాలు కప్పి రైతులు అవస్థలు పడ్డారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : బాపులపాడు మండల వ్యాప్తంగా ఆదివారం ఉదయం చీకటిని తలపించేలా కారుమబ్బులు కమ్మివేశాయి. 8 నుంచి 10గంటల వరకూ ఈదురుగాలులతో కూడిన వర్షం పడటంతో మండల వ్యాప్తంగా ఆరు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ అధికారులు పరిస్థితి సమీక్షించి తెగి పోయిన మెయిన్‌లైన్‌కు మరమ్మతులు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు. అకాల వర్షంతో మల్లవల్లి, కొత్తపల్లి తదితర మెట్ట ప్రాంతంలోని మామిడి కాయలు రాలిపోవడంతో రైతులకు నష్టం వాటిల్లింది.

ఉంగుటూరు : మండలంలో ఆదివారం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఉదయం ఆకాశంలో నల్లటి మేఘాలు కమ్మేయడంతో చీకట్లు ఆవరించి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. వెంటనే వర్షం మొదలయ్యింది. దాదాపు గంటసేపు కుండపోతగా వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు, రహదారులన్నీ జలమయమయ్యాయి. వర్షపునీరు రోడ్లపై ప్రవహించడంతో పలుచోట్ల వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

● పెద అవుటపల్లిలోని బ్రదర్‌జోసఫ్ తంబి పుణ్యక్షేత్రం ఎంట్రన్స్ గేటు బయట వర్షానికి డ్రెయినేజీ వ్యవస్థ స్తంభించింది. ఆక్రమణల వల్ల వర్షపునీరు వెళ్లేందుకు ఆటంకం ఏర్పడటంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. సమస్యను పుణ్యక్షేత్రం రెక్టర్ రెవరెండ్ ఫాదర్ పాలడుగు జోసఫ్ పంచాయతీ కార్యదర్శి జంగం యోహాన్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి పూడిక పనులు చేపట్టారు.







పెనమలూరులో ఆటోపై విరిగిపడ్డ చెట్టు.. కాటూరు రోడ్డులో.. ఉయ్యూరు ప్రధాన రహదారిపై సీబీఎం చర్చి సమీపాన రోడ్డుపై నిలిచిన నీరు



వీరవల్లి గ్రంథాలయ ఆవరణలో పుస్తక పఠనంలో పాల్గొన్న విద్యార్థులు

విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు దోహదం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : విజ్ఞాన సముపార్జనతో పాటు పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించేందుకు గ్రంథాలయాలు దోహదపడదాయని అధికారి పి.స్వర్ణలతాదేవి అన్నారు. వీరవల్లి గ్రంథాలయంలో ఆదివారం వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా డాక్టర్ అంబేడ్కర్ జీవిత చరిత్రపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు కథల పుస్తకాలు చదివించి వారు నేర్చుకున్న అంశాలపై మాట్లాడేలా కార్యక్రమం నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జీవిత చరిత్ర ద్వారా నేర్చుకున్న అంశాలపై విద్యార్థులకు వక్తృత్వ పోటీ నిర్వహించారు.



వైద్యశిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

వైద్యశిబిరానికి విశేషస్పందన

పెనమలూరు, మే 4 (ఆంధ్రజ్యోతి) : పోరంకి టీడీపీ కార్యాలయంలో అనుమోలు ఆదరణ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఉచిత వైద్యశిబిరానికి స్థానికుల నుంచి అనూహ్యస్పందన లభించింది. షుమారు రెండు వందలకుపైగా హాజరైన ఈ శిబిరంలో పోరంకి క్యాపిటల్ ఆసుపత్రి వైద్యులు స్థానికులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. షుగర్, బీపీ తదితర వ్యాధులకు తగ్గ మందులను ఎమ్మెల్యే బోడె ప్రసాద్, అనుమోలు ఆదరణ ట్రస్టు అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావులు అందించారు. ఈ కార్యక్రమంలో చెన్నుపాటి శ్రీనివాసరావు, బొంగరాల అబ్రహం పాల్గొన్నారు.

దౌర్జన్యం చేసిన యువకులపై కేసు నమోదు

హనుమాన్‌జంక్షన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాన్ని అటకాయించి దౌర్జన్యం చేసిన కానుమోలుకు చెందిన యువకులపై జంక్షన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం అర్ధరాత్రి కేసు నమోదు అయ్యింది. ఎస్సై లక్ష్మీ నరసింహమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్నట్లు తెలిసి కానుమోలుకు చెందిన కొందరు యువకులు శుక్రవారం ఆరుగొలను నుంచి వాహనాన్ని వెంబడించి తిప్పనగుంట అడ్డరోడ్డు వద్ద అటకాయించారు. దీంతో సరుకు యజమాని ఏలూరుకు చెందిన కొనకళ్ల మనోజ్ సాయికుమార్ రంగంలోకి దిగి వాహనాన్ని పంపించేశాడు. ఈ నేపథ్యంలో యజమానిపై దౌర్జన్యం చేసి రూ.30వేలు నగదుతో పాటు ఐ ఫోన్ లాక్కొన్నట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై లక్ష్మీనరసింహమూర్తి తెలిపారు.

తప్పుడు కేసు బనాయించిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలి

నిందితులపై తప్పుడు కేసు బనాయించిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని స్థానిక కూటమి నాయకులు చలమలశెట్టి రమేశ్ బాబు, దయాల రాజేశ్వరరావు, చింతల వెంకట శివఅప్పారావు, చిన్నాల సత్య గణేష్, బేతాళ శరత్, అడ్వకేట్ అరిగల రాజా తదితరులు పోలీసులను డిమాండ్ చేశారు. ఆదివారం నిందితుల తరపున ఎస్సై లక్ష్మీ నరసింహమూర్తితో నాయకులు మాట్లాడారు. రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తి మీద కేసు పెట్టకుండా అమాయకులపైన తప్పుడు కేసు నమోదు చేయడం అన్యాయమంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్లస్టర్ పాఠశాలల్లో సిబ్బందిని నియమించాలి

పమిడిముక్కల, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన కస్టర్ పాఠశాలల్లో సీఆర్ఎంటీ, డిజిటల్ అసిస్టెంట్‌తో పాటు నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించాలని జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం కార్యవర్గ సమావేశంలో తీర్మానించినట్టు సంఘం అధ్యక్షుడు వైఎస్ఎన్ ప్రసాద్ తెలిపారు. తాడంకి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఆదివారం జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం కార్యవర్గ సమావేశం వైఎస్ఎన్ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ప్రభుత్వ పాఠశాలలకు పేరుకుపోయిన విద్యుత్ బిల్లుల బకాయిలు ప్రభుత్వం చెల్లించడం సంతోషకరమని అందుకు సంఘం కృతజ్ఞతలు తెలిపినట్టు పేర్కొన్నారు. ఏపీ ప్రధానోపాధ్యాయ సంఘం గౌరవాధ్యక్షుడు కేఎస్ జగదీశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కే విజయ్, ఉయ్యూరు డివిజన్ అధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్, కార్యదర్శి బి.శ్రీనివాసరావు, మూడు డివిజన్ల అధ్యక్ష కార్యదర్శులు, మహిళా ప్రతినిధులు ఎన్.కనకదుర్గ, జి.పద్మావతి, ఎన్.సలోమి పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వీరవల్లి హైస్కూల్‌కు రూ.3.5లక్షలతో వాటర్ ప్లాంట్ వితరణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపారాలతో పాటు వివిధ రంగాల్లో స్థిరపడిన వీరవల్లి హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉల్లాసకర వాతావరణంలో ఆదివారం నిర్వహించారు. వీరవల్లిలోని లంక వీరయ్య జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో 1994-95 బ్యాచ్ పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనాన్ని ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. పూర్వ విద్యార్థులంతా కలిసి ప్రాగణ మంతా కలియతిరుగుతూ అనాటి తీపిగుర్తులను జ్ఞాపకం చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సాదరంగా సత్కరించారు. తాము చదువుకున్న హైస్కూల్ అభివృద్ధికి సహకారం అందిస్తామని హామీ ఇవ్వడంతో పాటు రూ.3.50లక్షల వ్యయంతో నిర్మించిన మినరల్‌వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఏర్పాట్లు చేసిన మిత్రులు నళినీకాంత్, అప్పారావు, చందు శ్రీనివాసరావు, నజీర్, గుర్నాథం తదితరులను అందరూ కలిసి అభినందించారు. తీపి గుర్తులతో మళ్లీ కలుద్దామని చదువుకున్న స్కూల్ అభివృద్ధికి అందరం కలిసి సహకరిద్దామని తీర్మానించుకున్నారు.



తేలప్రోలులో భగీరథ మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సగర సంఘం నేతలు

ఘనంగా భగీరథ మహర్షి జయంతి

ఉంగుటూరు, మే 4 (ఆంధ్రజ్యోతి) : కఠోరశ్రమ, పట్టుదల, కార్యదీక్షతో ఎంతటి ఘన కార్యాన్నైనా సాధించగలమని నిరూపించిన భగీరథ మహర్షిని స్మరించుకోవడం అందరి బాధ్యత అని సగర(ఉప్పర)సంఘం నాయకుడు గండికోట శ్రీనివాసరావు అన్నారు. సగర కులస్థుల ఆరాధ్య దైవం భగీరథ మహర్షి జయంతి వేడుకలు తేలప్రోలు సగర సంఘం ఆధ్వర్యంలో స్థానిక చింతలపేటలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సగరసంఘం సభ్యులు తాడిశెట్టి కొండయ్య, గండికోట రంగారావు, రెడ్డి మనోహర్, నంద్యాల కరుణ, శంకర్, వంశీ పాల్గొన్నారు.



ఉయ్యూరులో..

ఉయ్యూరు భగీరథ జయంతిని ఆర్డీవో కార్యాలయం వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. భగీరథ చిత్రపటానికి తహసీల్దార్ సురేశ్‌కుమార్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. తపోదీక్షతో భువినుంచి దివికి గంగను తీసుకువచ్చిన భగీరథుడు ఆదర్శప్రాయుడని సురేశ్‌కుమార్ అన్నారు. భవానీశంకర్, ఇతర ఉద్యోగులు పాల్గొని నివాళులర్పించారు.

రోడ్డేశారు.. సైడ్ బర్మ్ మరిచారు

● తరచూ ప్రమాదాలు.. పట్టించుకోని అధికారులు

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)



కడవకొల్లు పంచాయతీ పరిధి వీరవల్లిలో సీసీ రోడ్డుకు ఇరువైపుల సైడ్ బర్మ్ లేక వాహనాలపై వెళ్లే వారు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మించి నెలలు గడుస్తున్నా సైడ్ బర్మ్ పోయకుండా కాంట్రాక్టర్ వదిలివేశాడు. దీంతో వాహనాలు తప్పుకునే సమయంలో రోడ్డుకు సైడ్ బర్మ్ లేక జారిపడి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు సైడ్‌బర్మ్ వేయించాలని స్థానికులు కోరుతున్నారు.

ఏఎన్ఎంలను చులకనగా మాట్లాడడం సరికాదు

ఉమెన్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి

గన్నవరం, మే 4 (ఆంధ్రజ్యోతి) : ఏఎన్ఎం, హెల్త్ సూపర్‌వైజర్లను సీహెచ్‌వోలు కించపరచి మాట్లాడడం సరికాదని ఉమెన్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు కేవీఎన్ జయలక్ష్మి అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, సీహెచ్‌వోలు వారి సమస్యలపై సమ్మెలోకి వెళితే ఆక్రమంలో ఏఎన్ఎం సూపర్‌వైజర్లను చులకన, హేళనగా మాట్లాడుతూ, వారి మనసులు గాయపరచడం సమంజసం కాదన్నారు. ఏఎన్ఎంలు రూ. 1200కు జాయిన్ అయ్యారని, సూపర్‌వైజర్లకు ఏబీసీడీలు కూడా రావని వెటకారం, వ్యంగంగా సీహెచ్‌వోలు మాట్లాడడం సమం జసం కాదన్నారు. ఎవరి సమస్యలు వారు ప్రభుత్వ దృష్టికి తీసు కువెళ్లి పరిష్కరించుకోవాలి తప్ప ఎదుట వారిని వేలెత్తిచూపడం నిందించడం సరికాదన్నారు. ఏఎన్ఎం, సూపర్‌వైజర్లకు సీహెచ్‌వోలు క్షమాపణ చెప్పాలని జయలక్ష్మి డిమాండ్ చేశారు. సంఘం సభ్యులు ఆర్వీ రమణ, వై.వనజ, నాగమణి, భవాని తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

ప్రజాభిమానంతో తొమ్మిది వేల ప్రదర్శనలు

నటుడు, మిమిక్రీ కళాకారుడు శివారెడ్డి



పుట్టగుంట సతీష్‌కుమార్‌తో నటుడు శివారెడ్డి

హనుమాన్‌జంక్షన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : స్టేజీలపై తాను ప్రదర్శించే మిమిక్రీ షోలకు ప్రజాదరణ బాగుందని ఇప్పటి వరకు తొమ్మిదివేల ప్రదర్శనలు చేశానని నటుడు, మిమిక్రీ కళాకారుడు శివారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన కుటుంబ మేతంగా జంక్షన్‌లోని పుట్టగుంట సతీష్‌కుమార్ ఫామ్ హౌస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, స్టేజీ ప్రదర్శనలు, సినీనట జీవితం తనకు రెండు కళ్ల లాంటివన్నారు. ప్రజాభిమానంతో 9వేల ప్రదర్శనలు ఇవ్వడం దేవుడు ఇచ్చిన వరమన్నారు. అందులో భాగంగా విదేశాల్లో దాదాపు వెయ్యి ప్రదర్శనలు ఇచ్చాన న్నారు. గత కొంత కాలంగా స్టేజీ ప్రదర్శనలతో బిజీగా ఉండడం వలన సినిమాలకు కొంతదూరమయ్యానన్నారు. సినిమాల్లో అవకాశాలు వస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు నందిగం స్వామి తదితరులు ఉన్నారు.



పోరంకిలోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన

పెనమలూరు, మే 4 (ఆంధ్రజ్యోతి) : పోరంకిలోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద రూ. 24 లక్షలతో నిర్మించ తలపెట్టిన డ్రెయినేజీ నిర్మాణానికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానికులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ తాడిగడప మునిసిపాలిటీలో అవసరమైన ప్రతి చోటా డ్రెయిన్లు నిర్మిస్తామని తెలిపారు. నిధుల కొరత ఉన్నప్పటికీ మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్, టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, తాతపూడి గణేష్, సంగెపు రంగారావు, పీతా గోపీచంద్, యాళ్ల చక్రవర్తి, ద్రోణవల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	148, 157, 168
చికెన్ విత్ స్కిన్	286
చికెన్ స్కిన్‌లెస్	296

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 470



ఉగ్రవాదం నశించాలని లక్ష్మీగణపతి హవనం

మోపిదేవి, మే 4 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదం నశించాలని, సనాతన ధర్మ పరిరక్షణ జరగాలనే సంకల్పంతో టేకుపల్లి బాల పార్వతీ సమేత రామేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష్మీ గణపతి హవనం జరిపారు. హైకోర్టు అడిషనల్ సొలిసిటర్ జనరల్ చల్లా ధనుంజయ్, న్యాయవాది యడవల్లి నాగ వివేకానంద, దేవాలయ ట్రస్టు బోర్డు చైర్మన్ యడవల్లి నీలలోహిత శాస్త్రి, అద్దెపల్లి రామేశ్వర్, వారణాసి ధర్మసూరి, ఆర్‌ఐ ఘంటసాల కృష్ణమోహన్, ప్రధాన అర్చకులు పిల్లలమర్రి శాస్త్రి, స్థానాచార్యులు లంక ప్రసాద్, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు

సుబ్రహ్మణ్యేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు

మోపిదేవి, మే 4 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఒక్కరోజులోనే స్వామి వారికి వివిధ సేవా రుసుముల ద్వారా రూ.9.63 లక్షలు ఆదాయం వచ్చింది. పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని ఆలయ ప్రాంగణంలోని నాగవల్లి వృక్షం వద్ద ముడుపులు కట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆదివారం విశిష్టత కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేయగా, వివిధ సేవా రుసుముల ద్వారా రూ.9,63,141 ఆదాయం వచ్చినట్లు ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికారు. ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు ఆలపాటి కుటుంబసభ్యులకు అందజేశారు.



కూచిపూడి నాట్య ప్రదర్శన ఇచ్చిన కళాకారులతో ప్రముఖులు

కూచిపూడి నాట్యం అజరామరం

మచిలీపట్నం టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : కూచిపూడి నాట్యకళ దేశ విదేశాలలో అజరామరంగా నిలిచిందని మచిలీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ టి. పెద్దిరాజు అన్నారు. బాలా త్రిపుర సుందరీ నృత్యనికేతన్ ఆధ్వర్యంలో ఈడేపల్లిలోని మహతి కళావేదికపై ఆదివారం కూచిపూడి కళాకారులు నృత్య ప్రదర్శన నిర్వహించారు. ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యుడు ఏలేశ్వరపు పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన నాట్య ప్రదర్శనలో అన్నమయ్య కీర్తనలకు కళాకారులు నృత్యప్రదర్శనలు ఇచ్చారు. భావతరంగిణి ఆధ్వర్యంలో భవిష్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన నాట్య ప్రదర్శనలో పాల్గొని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించిన కళాకారులకు ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు ప్రశంసాపత్రాలు అందజేశారు. నాట్యాచార్యుడు ఏలేశ్వరపు పూర్ణచంద్రరావును సత్కరించారు.



మోదుమూడి ఎంపీయూపీ స్కూల్ శతాబ్ది వేడుక స్థూపాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మోదుమూడి పాఠశాలకు పూర్వ వైభవం రావాలి

● శతాబ్ది వేడుకల్లో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : మోదుమూడి పాఠశాలకు పూర్వ వైభవంగా రావాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆకాంక్షించారు. మోదుమూడి ఎంపీయూపీ స్కూల్ శతాబ్ది వేడుకల్లో ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన పాఠశాలకు పూర్వ వైభవం తేవాల్సిన బాధ్యత గ్రామపెద్దలు, పూర్వ విద్యార్థులపై ఉందన్నారు. శతాబ్ది వేడుక స్థూపాన్ని ఆయన ఆవిష్కరించారు. సర్పంచ్ బచ్చు బేబీ, ఎంపీటీసీ సభ్యుడు కటికల వసంత్, డీసీ వైస్ చైర్మన్ బచ్చు వెంకటనాథ్ ప్రసాద్, కూటమి నాయకులు బచ్చు వెంకట నారాయణ, బచ్చు మల్లిఖార్జునరావు, విశ్రాంత డీపీఆర్వో కంచర్ల జయరావు, హెచ్‌ఎం బచ్చు అమరనాథ్, ఎస్ఎంసీ చైర్మన్ గాజుల ద్వారకి, విశ్రాంత హెచ్‌ఎం బచ్చు వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ బచ్చు వెంకటేశ్వరరావు, పూర్వ విద్యార్థులు బచ్చు సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఉపాధ్యాయులు సకనా వెంకటేశ్వరరావు, బచ్చు వెంకటేశ్వరరావు, రేపల్లె వెంకటేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు గుడిసేవ విష్ణు ప్రసాద్, మార్క్‌ఫెడ్ ఎండీ బచ్చు ఆదినారాయణ, డీఆర్‌డీవో శాస్త్రవేత్త బచ్చు వెంకట సుబ్రహ్మణ్యం, జిల్లా కోర్టు న్యాయవాది నగధరనాథ్ పాల్గొన్నారు.



మినుము కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

మినుము కొనుగోలు కేంద్రం ప్రారంభం

అవనిగడ్డ రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసే మినుము కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మండల పరిధిలో మోదుమూడి రైతు సేవా కేంద్రంలో నాఫెడ్, మార్క్‌ఫెడ్ సంయుక్త ఆధ్వర్యంలో మినుము కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం క్వింటా మినుము రూ.7400లకు కొనుగోలు చేస్తుందన్నారు. మండలంలో 500 క్వింటాళ్ల మినుములు కొనుగోలు అంచనాతో కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, బచ్చు వెంకటనాథ్ ప్రసాద్, ఏవో సౌరమ్మ, కూటమి నేతలు బచ్చు వెంకట నారాయణ, బచ్చు మల్లిఖార్జునరావు, డీసీ వైస్ ప్రెసిడెంట్ బచ్చు రఘునాథ్ ప్రసాద్, నాయకులు బచ్చు రఘునాథ్ ప్రసాద్, నాయకులు బచ్చు శ్రీహరి, వీఏ నారాయణ, టెక్నికల్ అసిస్టెంట్ సవిత తదితరులు పాల్గొన్నారు. **కోడూరు :** మినుముల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగపర్చుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. వి.కొత్తపాలెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం వద్ద కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. క్వింటాకు ప్రభుత్వం మద్దతు ధర రూ.7400 చెల్లించనున్నట్లు తెలిపారు.

వైభవంగా అంకాలమ్మ జాతర

అవనిగడ్డ రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : వేకనూరు శివారు గుడివాకవారిపాలెంలో కొలువై ఉన్న శ్రీ అంకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం రెండవ రోజైన శనివారం కూడా కొనసాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా భక్తులు అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అన్నసమారాధన నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తమ గ్రామంలో జరుగుతున్న అంకాలమ్మ జాతర మహోత్సవం తిలకించటానికి వివిధ గ్రామాల్లో స్థిరపడిన ప్రజలు విశేష సంఖ్యలో తరలివచ్చారు.



కల్లంలో తడిసిన పసుపును చూపుతున్న రైతు వెంకటేశ్వర ప్రసాద్



చెన్నూరులో పడిపోయిన విద్యుత్ స్తంభం, కొబ్బరి చెట్టు



పిట్టలంకలో దగ్ధమవుతున్న గడ్డివాములు

అకాల వర్షం - రైతుకు నష్టం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం అకాల వర్షం పడింది. మెట్ట ప్రాంతాల్లో వాణిజ్య పంటలు తడిసిపోయాయి. కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. పిడుగుపాటుకు గడ్డివాములు దగ్ధమయ్యాయి.

మోపిదేవి, మే 4 (ఆంధ్రజ్యోతి) : ఆదివారం కురిసిన అకాల వర్షం వాణిజ్య పంటలు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల వరకు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవటంతో మొక్కజొన్న, పసుపు పంటలు పొలాల్లోనే తడిసిముద్దయ్యాయి. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి పండించిన పసుపు పంట పొలాల్లో పాలిష్ చేసేందుకు ఆరబెట్టగా తడిసిపోయింది. ఉడకబెట్టిన పసుపును ఎండిన అనంతరం పాలిష్ చేసి విక్రయాలు చేస్తారు. మరో రెండు రోజుల్లో అమ్మేందుకు సిద్ధమవుతుండగా, అకాల వర్షం రూపంలో కల్లాల్లో ఆరబెట్టిన పసుపు తడిసిపోయిందని రైతులు వాపోతున్నారు. ఎకరాకు లక్షన్నర పెట్టుబడి పెట్టామని, ప్రస్తుతం మార్కెట్‌లో ధర కూడా అంతంత మాత్రంగానే ఉందని రైతుల తెలిపారు. నాణ్యత తగ్గిందనే సాకుతో ధరలో కోత విధిస్తారంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మోపిదేవి మండలంలో ఇప్పటికే బొందలపాటి వెంకటేశ్వర ప్రసాద్, రావి నాగేశ్వరరావు, రావి సురేష్, బాలరామకృష్ణలకు చెందిన పసుపు ఉడకబెట్టి ఆరబెట్టగా తడిసిపోయింది. ఆర్థికంగా తీవ్ర నష్టాలు ఎదుర్కొవాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **పెడన రూరల్ :** అకాల వర్షం కారణంగా గ్రామాలలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. చెన్నూరు పంచాయతీ సమీపంలో కొబ్బరిచెట్టు రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. మూడు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరా నిలిపియేయటంతో ప్రమాదాలు తప్పాయి. **నాగాయలంక :** నాగాయలంకలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులతో కురిసిన వర్షానికి బోసుబొమ్మ సెంటర్‌లోని రహదారులు వాన నీటితో నిండి వాహనదారులకు అసౌకర్యాన్ని కలిగించాయి. తలగడదీవి గ్రామంలో జిన్నాబత్తుల శేషగిరి ఇంటి వద్ద కొబ్బరి చెట్టు మీద పిడుగు పడింది. **అవనిగడ్డ :** అవనిగడ్డలో ఆదివారం ఉదయం కురిసిన భారీ వర్షంతో రహదారులు జలమయం అయ్యాయి. మధ్యాహ్న సమయంలో భారీ ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో ఒక్కసారిగా వర్షం పడగా, గాలుల తాకిడికి మండల పరిధిలోని పాత ఎడ్లంక, వేకనూరు, పులిగడ్డ గ్రామాల శివారుల్లోని లంక భూముల్లో ఉన్న మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. మామిడికాయలు రాలి పోవటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. **చల్లపల్లి :** చల్లపల్లిలో ఆదివారం ఉదయం భారీ వర్షం కురిసింది. సుమారు గంటకు పైగా వర్షం కురిసింది. రోడ్లపై, పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచింది.

పిడుగు పడి గడ్డివాములు దగ్ధం

కోడూరు : పిట్టలంక గ్రామంలో మారుబోయిన శివశంకరరావు ఇంటి వద్ద పది ఎకరాల వరిగడ్డివామి ఆదివారం మధ్యాహ్నం పిడుగు పడి దగ్ధమైంది. అవనిగడ్డ అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటల్ని అదుపు చేశారు.





గౌడపాలెం రామాలయంలో ప్రతిష్ఠించిన సీతారామలక్ష్మణుల విగ్రహాలు, ప్రతిష్ఠా హోమాలు



రాయపల్లిలో గోపు సత్యనారాయణ పూజలు

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

చల్లపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీపురం గౌడపాలెంలోని సీతారామాలయంలో సీతారామలక్ష్మణ హనుమత్ నూతన శిలావిగ్రహ పునఃప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం వేదపండితులు అగ్నిహోత్రం వంశీ బ్రహ్మత్వంలో జరిగింది. ఏడుగురు దంపతులు ప్రతిష్ఠాపూజలు చేయగా, ఆలయ కమిటీ పెద్దలు ఏర్పాట్లు పర్యవేక్షించారు. అన్నసమారాధన జరిగింది. దేవాలయాన్ని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎన్నారై బొబ్బా గోవర్ధన్, మాజీ ఎంపీపీ యార్లగడ్డ లంకబాబు, పలువురు ప్రముఖ దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ పెద్దలు అతిథులను ఘనంగా సత్కరించారు.

రాయపల్లిలో రాముడి విగ్రహం..

మచిలీపట్నం టౌన్ : బందరు మండలం తాళ్లపాలెం శివారు రాయపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన అయోధ్య కోదండ రామస్వామి మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, వంకా వీరనాగేశ్వరరావు, పెదప్రోలు కుమార్, గోపు స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొనకళ్ల నారాయణరావు జన్మదిన వేడుక

అవనిగడ్డ, మే 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు జన్మదిన వేడుకలు అవనిగడ్డలో ఘనంగా నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు యాసం చిట్టిబాబు నేతృత్వంలో జరిగిన వేడుకల్లో నియోజకవర్గానికి చెందిన ఆరు మండలాల ముఖ్యనేతలు పాల్గొని కొనకళ్ల నారాయణరావు చేత కేక్ కట్ చేయించారు. తలశిల స్వర్ణలత, మాచవరపు ఆదినారాయణ, కర్రా సుధాకర్, విశ్వనాథుని మురళీ, మెండు లక్ష్మణరావు, ఉప్పల ప్రసాద్, విశ్వనాథపల్లి పాప, సుంకర లక్ష్మీ, యాసం లక్ష్మీ, మొగల్ మురాద్, షేక్ బాబావలి, లింగం బాబురావు, గుడివాక శివరావు పాల్గొన్నారు. **కోడూరు :** టీడీపీ కార్యాలయం వద్ద మాజీ ఎంపీపీ పెద్ది భాస్కరరావు, మాచర్ల భీమయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. వేమూరి ప్రభాకర్‌రావు, నాగం బాపయ్య, పసుపులేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు. మండల టీడీపీ అధ్యక్షులు బండే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉల్లిపాలెంలో భారీ కేక్‌ను కొనకళ్ల నారాయణరావు కట్ చేశారు. రవీంద్రబాబు, సోమశేఖరరావు, పిల్లి మల్లిఖార్జునరావు, జాన్ విల్సన్, బొలిశెట్టి విఠల్ రావు, కొప్పనాతి సత్యనారాయణ, యానాదిరావు, పోతురాజు, పాండురంగారావు, పోతురాజు, దావు మల్లి, కాగిత ప్రసాద్, ఆరేపల్లి లక్ష్మీనారాయణ, వీరంకి వెంకటేశ్వరరావు, యార్లగడ్డ రమణ, కోట రత్నారావు, మహమ్మద్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

గంజివానిపాలెంలో 20 గ్రాముల బంగారం చోరీ

మోపిదేవి, మే 4 (ఆంధ్రజ్యోతి) : తాళాలు వేసి ఉన్న ఇంట్లో బీరువా పగులకొట్టి 20 గ్రాముల బంగారు నగలు అపహరించుకు పోయిన గంజివానిపాలెంలో శనివారం రాత్రి జరిగింది. జన్ను నాగలక్ష్మి ఇంటికి తాళం వేసి అవనిగడ్డ మండలం పులిగడ్డలో ప్రార్థనా సమావేశాలకు వెళ్లింది. ప్రార్థన ముగించుకుని రాత్రి 10.30 గంటలకు ఇంటికి వచ్చి చూడగా, ఇంటి తలుపులు తెరచి బీరువా తాళం పగులగొట్టి ఉంది. బీరువాలోని చెవి పోగులు, రెండు ఉంగరాలు, బంగారపు చైన్ పోయినట్లు గుర్తించి నాగలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



భగీరథ మహర్షికి కలెక్టర్ బాలాజీ నివాళి

మచిలీపట్నం టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : విజయాలు సాధించేందుకు భగీరథునిలా ప్రయత్నించాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. భగీరథ మహర్షి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్ డీకే బాలాజీ పూలమాల వేసి అంజలి ఘటించారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ, చిత్తశుద్ధితో పని చేస్తే సాధించలేనిది లేదన్నారు. డీఆర్‌వో చంద్రశేఖర్, ఏవో వీరాంజనేయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో భగీరథుని చిత్రపటానికి జేడీ చిననరసింహులు, టీడీపీ నాయకుడు పి.వి. ఫణికుమార్, వెటర్నరీ సంఘం నాయకుడు అక్కినేని విజయకుమార్, పశుసంవర్ధక శాఖ డీడీ నాగభూషణ బాబు, జె.వి. రమణయ్య, పశుసంవర్ధక శాఖ కార్యాలయం నాగమణి తదితరులు పాల్గొన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో భగీరథ మహర్షి చిత్రపటానికి కమిషనరు బాపిరాజు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. మేనేజరు కెఎస్ ప్రసాద్, ఆర్‌ఐ ఎస్ వెంకటేష్, సీనియర్ అకౌంటెంట్ జి. అశ్విని కుమార్, కెసాంబ శివరావు తదితరులు పాల్గొన్నారు.

క్వాంటమ్ టెక్ పార్క్‌తో ఉద్యోగావకాశాలు

అవనిగడ్డ, మే 4 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో శంకుస్థాపన చేసిన క్వాంటమ్ వ్యాలీ టెక్ పార్క్ నవ్యాంధ్ర భవితకు బాటలు వేస్తుందని ప్రముఖ పారిశ్రామిక వేత్త, టీడీపీ నాయకులు బొబ్బా గోవర్ధన్ అన్నారు. నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐబీఎం, టీసీఎస్ సంస్థలు మద్రాస్ ఐఐటీతో కలసి అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ టెక్ పార్క్‌ను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుతో అమరావతిలో ఉద్యోగ అవకాశాలు పెంపొందించటంతోపాటు ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. క్వాంటమ్ వ్యాలీ టెక్ పార్క్‌కు కృషి చేసిన మంత్రి నారా లోకేష్, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు, రాష్ట్ర ప్రతిపాదనలు ఆమోదించిన ప్రధాని మోదీకి బొబ్బా గోవర్ధన్ కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ సీనియర్ నాయకులు బండే శ్రీనివాసరావు, తెలుగుయువత నాయకులు మేడికొండ విజయ్, కోట సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించండి

● హెచ్‌ఎం దాస్ వినూత్న ప్రచారం



చల్లపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని కోరుతూ చల్లపల్లి నారాయణరావునగర్ మోడల్ పాఠశాల హెచ్‌ఎం, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు కైతేపల్లి దాస్ వినూత్నరీతిలో ప్రచారం చేస్తున్నారు. తన ద్విచక్ర వాహనం చుట్టూ బ్యానర్లు కట్టుకుని కాలనీలో ప్రతి బజారు తిరుగుతూ తల్లిదండ్రులను కలిసి తమ పాఠశాలలో పిల్లలను చేర్పించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు. నాణ్యమైన విద్యతోపాటు ప్రభుత్వం అనేక సౌకర్యాలు, ప్రయోజనాలు కల్పిస్తున్న నేపథ్యంలో పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాల, ప్రవేటు పాఠశాలల్లోని వ్యత్యాసాలు వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను తల్లిదండ్రులకు అందజేశారు. ఇప్పటికే 12 మంది పిల్లలను పాఠశాలలో చేర్చుకున్నట్లు దాస్ తెలిపారు.

కులదూషణ ఫిర్యాదుపై డీఎస్పీ విచారణ



తిరుమల భర్త, కుమారుడిని విచారిస్తున్న డీఎస్పీ రాజా

పెడన, మే 4 (ఆంధ్రజ్యోతి) : బల్లిపర్రులో దళిత మహిళను కులం పేరుతో దూషించి, దాడి చేసిన సంఘటనపై మచిలీపట్నం డీఎస్పీ సిహెచ్. రాజా ఆదివారం విచారణ నిర్వహించారు. ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్న జల్లుల వెంకటేశ్వరరావు ఈనెల 1వ తేదీ రాత్రి నైట్ డ్యూటీకి వెళ్లారు. అతని భార్య తిరుమల, కుమారుడు ప్రవీణ్‌కుమార్ ఒంటి ఆవరణలో పడుకుని ఉండగా ఇంటి పక్కన ఉండే గాదె సురేంద్ర మరో ఇద్దరితో వచ్చి తిరుమలను కులం పేరుతో దూషించి, దాడి చేసి గాయపరిచినట్లు ఫిర్యాదు అందింది. దాడిలో గాయపడి మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తిరుమలను తొలుత డీఎస్పీ విచారించారు. బల్లిపర్రు గ్రామంలోని తిరుమల ఇంటికి వెళ్లి ఆమె భర్త వెంకటేశ్వరరావు, కుమారుడు ప్రవీణ్‌కుమార్‌లను, చుట్టుపక్కల వారిని కూడా డీఎస్పీ విచారించారు. విచారణలో డీఎస్పీకి సీఐ నాగేంద్రప్రసాద్, ఎస్సై సత్యనారాయణ, ఏఎస్సై లక్ష్మణరావు, వీఆర్వో ప్రసాదరావు సహకరించారు.



చల్లపల్లి రాజా హైస్కూల్‌లో 1997-98 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు



అర్తమూరు పాఠశాల 2008-2009 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

సందడిగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చల్లపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి రాజా హైస్కూల్‌లో 1997 - 98 బ్యాచ్ టెన్త్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కళాశాల ప్రాంగణంలో సందడిగా జరిగింది. ఆహ్లాదకర వాతావరణంలో ఒకరినొకరు కలుసుకుని హైస్కూల్‌లో తాము చదువుకున్న నాటి స్మృతులు నెమరువేసుకున్నారు. విశ్రాంత ప్రిన్సిపాల్ టి. సాంబశివరావు, విశ్రాంత ఉపాధ్యాయులు రాయపాటి ప్రసాదరావు, డి.జవహర్, పి.ప్రభాకరరావు, ఎస్.సీతారామస్వామి, హెచ్‌ఎం ఎస్.సుదర్శన్, పీఈటీ శ్రీనివాస్, టిఎస్‌వి ఎస్.శాస్త్రిలను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. తమ దగ్గర చదువుకున్న విద్యార్థులు వివిధ రంగాల్లో ప్రయోజకులై రావటం పట్ల గురువులు సంతోషం వ్యక్తం చేశారు. చదువుకున్న విద్యాసంస్థ అభివృద్ధికి సహకారం అందించాల్సిందిగా కోరారు. పరిచయ కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

బంటుమిల్లి : అర్తమూరు ఉన్నత పాఠశాల 2008-2009 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాలలో సందడిగా జరిగింది. పాఠాలు చెప్పిన గురువుల సమక్షంలో పరిచయ కార్యక్రమం జరిగింది. వివిధ స్థాయిలలో ఉన్నత శిఖరాలను అధిరోహించిన పూర్వ విద్యార్థులు పరస్పరం మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	148, 157, 168
చికెన్ విత్ స్కిన్	286
చికెన్ స్కిన్‌లెస్	296

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 470

కొండాలమ్మ సన్నిధిలో భారీగా భక్తులు

గుడ్లవల్లేరు, మే 4 (ఆంధ్రజ్యోతి): వేమవరం శ్రీ కొండాలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకొన్నారు. 25వేలకు పైగా భక్తులు వచ్చి పాలపొంగళ్లు వండి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారని ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. భక్తులకు దేవస్థానం వారిచే తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు.



కొండాలమ్మ ఆలయంలో కిటకిటలాడుతున్న భక్తులు

కమ్మేసిన మేఘాలు.. కుమ్మేసిన వర్షం

గుడివాడ, పామర్రు నియోజకవర్గాల పరిధిలో ఈదురుగాలులు, భారీ వర్షం

● నిండిన డ్రెయినేజీలు.. రోడ్లపైకి వర్షపు నీరు ● కూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ● లంకల్లో తడిచిపోయిన మొక్కజొన్న



గుడివాడలో మేఘావృతమైన ఆకాశం

గుడివాడ, మే 4 (ఆంధ్రజ్యోతి): ఆదివారం పట్టణంలో భారీ ఈదురుగాలులతో వర్షం కురిసింది. దాదాపుగా రెండు గంటల పాటు ఎడతెరిపి లేకుండా ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురవటంతో పట్టణంలో లోతట్టు, శివారు ప్రాంతాలు జలమయ్యాయి. పట్టణంలోని పలు డ్రెయిన్‌లు పొంగి మురుగు నీరు ప్రధాన రహదారులపైకి చేరింది. పాదచారులు, ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇటీవల మట్టి తోలకాల నేపథ్యంతో గ్రామీణ ప్రాంతాల్లో రహదారులపై నల్లమట్టి పేరుకుపోయింది. వర్షం వల్ల రహదారులపై ద్విచక్ర వాహనదారులు అనేక ఇబ్బందులు పడ్డారు.

గుడివాడ రూరల్ మండలంలో..

గుడివాడ రూరల్: మండలంలో ఆదివారం ఉదయం భారీ వర్షం కురిసింది. పంట నష్టం ఎక్కువ లేకపోయినా ఒక్కసారిగా ఈదురుగాలులు, భారీ వర్షం పడటంతో 2 నుంచి 3 గంటల వరకు గ్రామాల్లో విద్యుత్ సరఫరా లేదు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

కుప్పకూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

నందివాడ: ఆదివారం ఉదయం వచ్చిన గాలివానకు మండలంలోని పలుచోట్ల కొబ్బరి చెట్లు, చెట్లు ట్రాన్స్‌ఫార్మర్లపై పడిపోవటంతో మధ్యాహ్నం వరకు కరెంట్ లేక ప్రజలు నానా అవస్థలు పడ్డారు. పోలుకొండ నుంచి లక్ష్మీన రసింహాపురం వెళ్లే దారిలో ట్రాన్స్‌ఫార్మర్ పడిపోవటంతో చేపల చెరువుల యజమానులు చేపల గాలి ఆడక చనిపోతాయని భయాందోళన చెందుతున్నారు. గతంలో ఈ ట్రాన్స్‌ఫార్మర్ గురించి విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకుండా కాలయాపన చేయటంతో



పోలుకొండ నుంచి లక్ష్మీనరసింహాపురం వెళ్లే దారిలో గాలివానకు పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

ఆదివారం వచ్చిన గాలివానకు పూర్తిగా పడిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు ఆ ట్రాన్స్‌ఫార్మర్ వేయటానికి రెండు రోజులు పడుతుందని అధికారులు తెలపటంతో చేపల రైతులు అయోమయ పరిస్థితిలో ఉన్నారు. కనీసం గ్రామాల్లో సాగిపోయిన వైర్లను కూడా సరిచేయటం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. స్తంభాలు ఒరిగిపోయి చెట్లు పడి 11కేవీ వైర్లు కానీ గ్రామాల్లో ఎల్‌టీ వైర్లు గానీ చేతికందే వచ్చేలా ఉన్నాయి. ఏదైనా ప్రమాదం సంభవిస్తే తప్ప ఆ వైర్ల గురించి పట్టించుకోవటం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు వాలిపోయిన స్తంభాలు, సాగిపోయిన వైర్లను బిగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఊరటనిచ్చిన వర్షపు జల్లులు

పామర్రు: నిన్న మొన్నటి వరకు పెరిగిన ఉష్ణోగ్రతలకు విలవిల్లాడిన ప్రజలకు ఆదివారం వాతావరణం కాస్త చల్లబడి తొలకరి పలకరించింది. పామర్రు పరిధిలో ఒక్కసారిగా వాతావరణం మారి వర్షపు జల్లులు కురవడంతో ప్రజలు, రైతులు ఆనందంలో మునిగిపోయారు. పలు ప్రాంతాల్లో ఒక మోస్తారుగా చినుకులు కురవడంతో ఎండ తీవ్రత, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు ఉపశమనం చెందారు. కొద్ది రోజులుగా ఎండలు వడగాడ్పులు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న సంగతి విధితమే. ఎట్టకేలకు తేలికపాటి వర్షపు జల్లులతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. రానున్న రోజుల్లో మంచి వర్షాలు వస్తాయని, అల్పపీడనం ఉంటుందని వాతావరణ శాఖ చెప్పడంతో రైతులు పొలాల్లో ముందస్తుగా దుక్కులు దున్నే పనుల్లో నిమగ్నం కానున్నారు.



వల్లూరుపాలెంలో కల్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్న రాశులపై వర్షానికి తడవకుండా కప్పిన పరదాలు

తడిసిన మొక్కజొన్న

తోట్లవల్లూరు: మండలంలో ఆదివారం ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. ఉదయం 9 గంటల సమయంలో ఆకాశంలో ఒక్కసారిగా కారుమబ్బులు కుమ్మకు వచ్చి సుడిగాలి చెలరేగింది. లంకల్లో భారీగా మొక్కజొన్న పంటను కోతకోసి కల్లాల్లో ఆరబెట్టిన రైతులు ఉరుకులు పరుగులు పెట్టి వెళ్లేలోగానే వర్షం కారణంగా పంట తడిసిపోయింది. సమయానికి పొలం వద్ద ఉన్న రైతులు పంటపై పరదాలు కప్పి జాగ్రత్త చేసుకోగా చాలామంది రైతుల మొక్కజొన్న తడిసిపోయింది. దీంతో వర్షం తగ్గాక పంటను ఆరబెట్టుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. అలాగే కోత కోయని మొక్కజొన్న తోటలు పడిపోయాయి. స్వల్పంగా అరటి తోటలు దెబ్బతిన్నాయి. చెరకు తోటలకు మాత్రం వర్షం మేలు చేసిందని రైతులు తెలిపారు. పంటలు తడిసినప్పటికీ మండువేసవిలో కూల్ వాతావరణం ప్రజలను సేదతీర్చింది.

ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతికలోపం

● తోట్లవల్లూరు పరిధిలో నిలిచిన విద్యుత్ సరఫరా
● వల్లూరుపాలెం నుంచి లైన్ కలిపి విద్యుత్ పునరుద్ధరణ



విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్న టెక్నికల్ సిబ్బంది

తోట్లవల్లూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సాంకేతిక సమస్య ఏర్పడింది. సబ్ స్టేషన్ లోని 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌లో లోపం ఏర్పడటంతో శనివారం సాయంత్రం 7 నుంచి రాత్రి 10 గంటల వరకు తోట్లవల్లూరు, భద్రిరాజుపాలెం ప్రజలు అంధకారంలో గడపాల్సి వచ్చింది. విద్యుత్ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి వల్లూరుపాలెం సబ్‌స్టేషన్ నుంచి తోట్లవల్లూరు సబ్‌స్టేషన్‌కు లింక్ కలిపి రాత్రి 10 గంటలకు విద్యుత్ పునరుద్ధరించారు. ఆదివారం ఉదయం 9 గంటలకు ఈదురుగాలులు వీచి వల్లూరుపాలెం నుంచి వచ్చే విద్యుత్ లైన్‌పై చెట్ల కొమ్మలు విరిగి పడటంతో మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు తాగునీటికి కటకటలాడాల్సి వచ్చింది. దీంతో ఏడీ రవిచంద్ర, ఏడీఈ ప్రేమ్‌కుమార్, ట్రాన్స్‌ఫార్మర్స్ ఈఈ పార్థసారథి, మండల ఏఈ దేవదాసు వచ్చి 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ విలువ రూ.50 లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. సాంకేతిక సమస్య ఏర్పడిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలనే నిర్ణయానికి అధికారులు వచ్చారు. కొత్తది ఏర్పాటు చేసేవరకు వల్లూరుపాలెం నుంచి విద్యుత్ ఇస్తామని ఏఈ దేవదాసు తెలిపారు.



డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల, కమిషనర్ మనోహర్

డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేస్తా

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, మే 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను మరింత అభివృద్ధి చేస్తానని, రహదారులపై నిలిచిన వర్షపు నీటిని వెంటనే తొలగించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అధికారులను ఆదేశించారు. ఆదివారం భారీ వర్షం కురిసిన అనంతరం పట్టణంలోని గుడ్‌మెన్‌పేట, కోతిబొమ్మ సెంటర్, బస్టాండ్ సెంటర్, సత్యనారాయణపురం, అరవపేట, స్లేటరు పేట తదితర ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్‌తో కలిసి ఎమ్మెల్యే వెనిగండ్ల పర్యటించారు. కొద్దిపాటి వర్షానికే పట్టణంలో దారుణ పరిస్థితులన్నాయని, సమస్య పెద్దది కాకమునుపే డ్రైనేజీల అభివృద్ధికి అంచనాలు రూపొందించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రాబోయే నాలుగేళ్లలో తాగునీరు, రహదారులు, డ్రైనేజీల సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నామని వెనిగండ్ల స్పష్టం చేశారు. అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు సుభిక్షంగా ఉండాలి

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, మే 4 (ఆంధ్రజ్యోతి): శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని, విశ్వబ్రాహ్మణ సంఘీయుల ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలకు సంపూర్ణ సహకారం ఉంటుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆకాంక్షించారు. ఆదివారం స్థానిక దేవరకొండ నాగన్న సత్రం ప్రాంగణంలో జరుగుతున్న శ్రీశ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 54 వ ఆరాధన మహోత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు కోటనూకరాజు, పులవర్తి ఆనంద్, దుర్గాచారి, నారాయణ, పెదపాటి రవి, దుర్గాప్రసాద్, ముండూరి ప్రసాద్, ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోకవరపు సునీల్, దేవరపల్లి కోటి పాల్గొన్నారు.

నేడు నియోజకవర్గ సమీక్ష సమావేశం

గుడివాడ, మే 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశమందిరంలో సోమవారం ఉదయం 8 గంటలకు కలెక్టర్ డీకే బాలాజీ, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో నియోజకవర్గ సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్టు సమాచార శాఖ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. సమావేశానికి ప్రభుత్వ శాఖల అధికారుల తప్పక పాల్గొనాలని ఆదేశించారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికకు కలెక్టర్ డీకే బాలాజీ, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హాజరు కానున్నట్లు ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

క్లస్టర్ పాఠశాలల్లో సిబ్బందిని నియమించాలి

● జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం



పమిడిముక్కల, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన క్లస్టర్ పాఠశాలల్లో సీఆర్‌ఎంటీ, డిజిటల్ అసిస్టెంట్‌తో పాటు నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించాలని జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం కార్యవర్గ సమావేశంలో తీర్మానించినట్టు సంఘం అధ్యక్షుడు వైఎస్ఎన్ ప్రసాద్ తెలిపారు. తాడంకి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఆదివారం జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం కార్యవర్గ సమావేశం వైఎస్ఎన్ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ప్రభుత్వ పాఠశాలలకు పేరుకుపోయిన విద్యుత్ బిల్లుల బకాయిలు ప్రభుత్వం చెల్లించడం సంతోషకరమని అందుకు సంఘం కృతజ్ఞతలు తెలిపినట్టు పేర్కొన్నారు. ఏపీ ప్రధానోపాధ్యాయ సంఘం గౌరవాధ్యక్షుడు కేఎస్ జగదీశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కే విజయ్, ఉయ్యూరు డివిజన్ అధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్, కార్యదర్శి బి.శ్రీనివాసరావు, మూడు డివిజన్ల అధ్యక్ష కార్యదర్శులు, మహిళా ప్రతినిధులు ఎన్.కనకదుర్గ, జి.పద్మావతి, ఎస్.సలోమి పాల్గొన్నారు.

20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

● ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనశ్రీ

గుడివాడ, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ, పట్టణ కమిటీల ఆధ్వర్యంలో ఈ నెల 20న జరుగు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనశ్రీ కోరారు. ఆదివారం స్థానిక కామ్రేడ్ సుందరయ్యభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ లేబర్ కోడ్ రద్దు చేయాలని, కనీస వేతనాలను చెల్లించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశాలుగా మార్చాలని, ఒప్పంద జీవోలు విడుదల చేయాలని, ఆశా నియామకాలను ప్రభుత్వమే చేపట్టాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, వీహెచ్‌సీ సమావేశాల టీఏ, డీఏ ఇవ్వాలని, ఆశాలకు సంబంధం లేని పనులు చేయించరాదనే డిమాండ్లతో సమ్మె నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆశా వర్కర్లు పెద్దఎత్తున పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని ధనశ్రీ పిలుపునిచ్చారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎం.సరోజ, ఏ భవానీ, డీ లక్ష్మీప్రసన్న, వీ కృష్ణకుమారి, డీ ఆదిలక్ష్మీ, సీపీఎం నేతలు ఆర్‌సీపీ రెడ్డి పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ అన్నదానం

గుడ్లవల్లేరు, మే 4 (ఆంధ్రజ్యోతి): గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ ద్వారా గ్రామంలో పేదలకు అన్నదానం నిర్వహించడానికి ఆద్యుడు, కొసరాజు వెంకటరామకృష్ణా చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి తద్వారా గ్రామంలో దాదాపు 150 మంది నిరుపేదలకు నిత్యం ఇంటింటికీ క్యారేజ్‌లతో భోజనాన్ని ఇంటికే పంపించిన అన్నదాత కొసరాజు వెంకటాద్రి చౌదరి (డాక్టర్‌బాబు) అని జంగం మోహనరావు అన్నారు. ఆదివారం వెంకటాద్రి చౌదరి వర్థంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులచే గుడ్లవల్లేరు లయన్స్ సేవాభవన్‌లో నిరుపేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబు చిత్రపటానికి పూలమాలను వారి సతీమణి కొసరాజు లక్ష్మీతులసి అలంకరించారు. లయన్స్ సభ్యులు నివాళులర్పించి అన్నదానం చేశారు. క్లబ్ కార్యదర్శి పెరుమాళ్ల, ట్రెజరర్ నవాబు, గుడివాడ ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, గుడ్లవల్లేరు ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, పోలవరపు వెంకటరావు, మత్తి శ్రీరామమూర్తి, పరందామయ్య, మూల్పూరి సుధాకర్, పోలవరపు లలితపద్మ, మూల్పూరి భార్గవి, యెర్నేని సురేష్, కొణతం ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రవర్తనలో మార్పు రావాలి

పెదపారుపూడి, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో నేరాల నివారణకు చెడు నడత కలిగిన వ్యక్తుల ప్రవర్తనలో మార్పు తీసుకురావటానికి, సమాజంలో శాంతిభద్రతలను మెరుగుపర్చటానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నివశించే నేరచరిత్ర ఉన్నవారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. భవిష్యత్‌లో నేరాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మహిళ ఆత్మహత్య

తోట్లవల్లూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): కలుపుమందు సేవించి చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన ఘటనపై ఆదివారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై సీహెచ్ అవినాష్ తెలిపారు. ఐలూరుకు చెందిన లోయ శివరామకృష్ణ భార్య ఉషాకుమారి (33) గత నెల 30న కడుపునొప్పి తట్టుకోలేక కలుపుమందు సేవించిందని, ఆమెను విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా 3న రాత్రి మృతిచెందిందని తెలిపారు. మృతురాలి తల్లి కోటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

మొక్కులు తీర్చుకున్న వైసీపీ నేతలు

నందివాడ, మే 4 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు గుండె ఆపరేషన్ చేయించుకుని ఆరోగ్యం కుదుట పడిన సందర్భంగా ఆదివారం నందివాడ నుంచి వెన్ననపూడి లూర్థు మాత దేవాలయం వరకు పాదయాత్ర చేసి లూర్థుమాత విగ్రహం వద్ద 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కుబడులు చెల్లించుకున్నట్టు మండల ఎంపీపీ, వైసీపీ నేత పెయ్యల ఆదాము తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్, వైసీపీ రాష్ట్ర నేత శశిభూషణ్, దేశిరెడ్డి రామ్ మోహన్ రెడ్డి, పాలడుగు రామ్ ప్రసాద్, పెయ్యల ఆదాం, గోర్ల శ్రీను, మేడేపల్లి ప్రసాద్, గూడపాటి ఇస్సాకు, చందు, నాగరాజు, సుధాకర్, అశోక్, నాగూర్, రంగారెడ్డి, కుమార్ రెడ్డి, నాగేశ్వరరావు, మండల వైసీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మినుము, పెసల కొనుగోలుకు ఏర్పాట్లు

గుడివాడ రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మినుములు, పెసలు కొనుగోలు చేయటానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి బోలెం అనంతలక్ష్మి తెలిపారు. గుడివాడ మార్కెట్ యార్డులో ప్రభుత్వ నిబంధనల ప్రకారం మినుములు క్వింటాల్ రూ.7400 చొప్పున మద్దతు ధర నిర్ణయించామన్నారు. మినుములు, పెసలు అమ్ముకునే రైతులు ఆయా గ్రామాల పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

సీపీఎం సీనియర్ నేత లక్ష్మణరావు బహిష్కరణ

● ఆర్‌సీపీ రెడ్డి

గుడివాడ, మే 4 (ఆంధ్రజ్యోతి): సీపీఎం విధివిధానాలకు వ్యతిరేకంగా వ్యవహరించడం వల్ల క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సీనియర్ నేత తమ్మిశెట్టి లక్ష్మణరావును పార్టీ నుంచి బహిష్కరించినట్టు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక కామ్రేడ్ సుందరయ్యభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేతలు సుధాకర్, ఐద్వా కార్యదర్శి పి.రజిని పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలు

గుడివాడ, మే 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం శ్రీ భగీరథ మహర్షి జయంతి సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ భగీరథ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భగీరథునికి నివాళులు

గుడ్లవల్లేరు: పవిత్ర గంగానదిని భూమిపై ప్రవహించేందుకు కఠోర తపస్సు చేసి సాధించిన తపోధనుడు భగీరథ మహర్షి జయంతిని ఆదివారం గుడ్లవల్లేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. భగీరథ చిత్రపటానికి పూలమాలలు వేసి పంచాయతీ సిబ్బంది నివాళులర్పించారు.

ఉచిత వైద్య శిబిరం

గుడివాడ, మే 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లోని ప్రభావతి గార్డెన్స్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో డా.లక్ష్మీ పెరుమాళ్ల, ప్రభావతి, చలసాని రాయన్ చౌదరి జ్ఞాపకార్థం డా.పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల సహకారంతో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. జనరల్ మెడిసిన్, ఎముకల వ్యాధుల విభాగాలకు చెందిన వైద్యులు డా.నాగజ్యోతి, డా.యోగానంద్ వైద్యసేవలందించి ఉచితంగా మందులను అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు టి.ఎన్ రాజశేఖర్, కార్యదర్శి జి.కిరణ్‌బాబు, ఎలక్ట్ అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, వైద్యకళాశాల మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ స్వామి, నర్సింగ్ విద్యార్థులు, ఫార్మసీ అసిస్టెంట్ రాధిక పాల్గొన్నారు.



కొండలమ్మ ఆలయంలో ఏపీఐఐసీ డైరెక్టర్ మండలి రాజేష్

కొండాలమ్మ సన్నిధిలో ఏపీఐఐసీ డైరెక్టర్

గుడ్లవల్లేరు, మే 4 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏపీఐఐసీ డైరెక్టర్ మండలి రాజేష్ ఆదివారం సాయంత్రం వేమవరం శ్రీకొండాలమ్మ అమ్మవారిని దర్శించుకొన్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం రాజేష్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు. అర్చకులు వేదాశీర్వచనచేసి సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని బహుకరించారు. విజయవాడ పశ్చిమ జనసేన నేత ఎస్.ఎస్.మూర్తి, గుడివాడ నియోజకవర్గ నేత సందు పవన్, పెడన నియోజకవర్గ నేత దాసరి సత్యనారాయణ, గుడివాడ పట్టణ జనసేన నేత సీతాల రామకృష్ణ, కొల్లూరి కిరణ్, భాగి సుమంత్, గుడ్లవల్లేరు మండల జనసేన నేతలు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకపఠనం అవశ్యకతను వివరిస్తున్న గ్రంథాలయాధికారి ఝాన్సీరాణి

పుస్తక పఠనాన్ని పెంపొందించుకోవాలి

● గ్రంథాలయాధికారి ఝాన్సీరాణి

పామర్రు, మే 4 (ఆంధ్రజ్యోతి): నేటి ఆధునిక యుగంలో పుస్తక పఠనం ప్రపంచ దేశాల్లో పెంపొంది అభివృద్ధి పథంలో పయనిస్తుంటే మన దేశంలో ఆధునిక పోకడలతో విద్యార్థులు పుస్తక పఠనాభిలాష తగ్గించుకోవడం విచారకరమని పామర్రు గ్రంథాలయాధికారి ఎం ఝాన్సీరాణి అన్నారు. స్థానిక జిల్లా గ్రంథాలయంలో విద్యార్థులకు జరుగుతున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం విద్యార్థులు వేసవిలో గ్రంథాలయాలను సందర్శించి పుస్తకపఠనాసక్తిని పెంపొందించుకోవాలని కోరారు. ఆంగ్ల భాష పట్ల అవగాహన కల్పించడంతోపాటు, పుస్తక పఠనం ప్రయోజనాలను వివరించారు. అలాగే జమీగోల్వేపల్లి గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి వి నాగసురేష్ పర్యవేక్షణలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్లిం కుటుంబానికి ఎమ్మెల్యే ఓదార్పు

పామర్రు, మే 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆషా ఆప్టికల్స్ అధినేత కాలిక్ మాతృమూర్తి ఆషా (55) గుండెపోటుతో శనివారం రాత్రి స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో మృతిచెందారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా వారి ఇంటికి వచ్చి ఆమె మృతదేహన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు పరామర్శించి ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. టీడీపీ నేతలు చాట్ల రమేష్, నీటి సంఘ ఉపాధ్యక్షుడు తాడిశెట్టి మధు పాల్గొన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆమె మృతదేహన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.